




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 337 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : కాకినాడ సోమవారం 11 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :337 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA MON 11 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది

### జడ్పీటీసీ ఉప ఎన్నికలపై జగన్ స్పందన

- పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు
- సీఎం చంద్రబాబుపై జగన్ తీవ్ర ఆరోపణలు
- అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలను హైజాక్ చేస్తున్నారని విమర్శ
- వైసీపీ నేతలపై టీడీపీ గ్యాంగులు దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నాయని ధ్వజం
- బాధితులపైనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన



**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్య విరుద్ధంగా, అరాచకం గా వ్యవహరిస్తున్నారని, కుట్రలు, దాడులు, అబద్ధాలతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ఎన్నికలను హైజాక్ చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ గూండాలు, కొందరు అధికారులు, పోలీసులు కలిసి ఈ కుట్రను అమలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కుట్రపూరిత ప్రణాళికలను అమలు చేస్తున్నారని మండపడ్డారు. "ఉపఎన్నిక ల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే పోలీసులు దౌర్జన్యాలు మొదలుపెట్టారు. గతంలో ఎలాంటి కేసులు లేని వారిపై కూడా బైండోవర్ కేసులు పెట్టి వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు" అని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న తమ పార్టీ నేతలే లక్ష్యంగా టీడీపీ గ్యాంగులు దాడులకు తెగబడుతున్నాయని జగన్ ఆరోపించారు. ఆగస్టు 6న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నేత వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగిందని, వారి కారును ధ్వంసం చేసి నిప్పంటించే ప్రయత్నం కూడా చేశారని తెలిపారు. ఈ దాడుల సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని విమర్శించారు. వైసీపీ తరఫున పనిచేస్తే ఇలాంటి దాడులే ఎదురవుతాయని భయపెట్టడానికే ఈ దారుణాలకు పాల్పడ్డారని అన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా, బాధితులైన వేల్పుల రాముతో పాటు మరో 50 మందిపై ఆగస్టు 6న మధ్యాహ్నం 3:30 గంటలకు తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ ఆరోపించారు. "ఆగస్టు 8న మా పార్టీ నేతను బెదిరించి, ప్రలోభపెట్టి ఫిర్యాదు తీసుకుని రాఘవరెడ్డి, గంగాధర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి వంటి వారికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అదే రోజున పులివెందులలో వైసీపీకి ఓట్లు వేసే సుమారు 4,000 మంది ఓటర్లను ఇబ్బంది పెట్టేందుకు, పోలింగ్ బూత్‌లను గ్రామాలకు 2 నుంచి 4 కిలోమీటర్ల

వివరాలు 2లో..

## ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక.. 'మేక్ ఇన్ ఇండియా'

- బెంగళూరులో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ లతో కలిసి ప్రధాని మోదీ మెట్రో రైడ్
- బెంగళూరు ఎల్లో లైన్ మెట్రో ప్రారంభోత్సవంలో ఆసక్తికర దృశ్యం
- ప్రధాని మోదీతో సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఆప్యాయ సంభాషణ
- మెట్రోలో ప్రధానికి ఇరువైపులా కూర్చుని ముచ్చటించిన కాంగ్రెస్ నేతలు
- రాజకీయ విమర్శలు పక్కనపెట్టి నవ్వుతూ కనిపించిన నేతలు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటోలు, వీడియోలు
- టెక్ హబ్ ఎలక్ట్రానిక్స్ సిటీని కలుపుతూ ఎల్లో లైన్ మెట్రో ప్రారంభం



**పెన్ పవర్ డెస్క్:** పాకిస్థాన్‌ను మట్టికరిపించిన 'ఆపరేషన్ సిందూర్ ' విజయం వెనుక 'మేక్ ఇన్ ఇండియా', మన సాంకేతికత దాగి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరికొత్త భారత్‌ను ప్రపంచం మొదటిసారి చూసిందన్నారు. రూ.15,610 కోట్ల వ్యయంతో బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. నవ భారతానికి చిహ్నంగా బెంగళూరు ఎదుగుతోందన్నారు."ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం తొలిసారి సరికొత్త భారత్‌ను చూసింది. మన బలగాలు పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని.. కొన్ని గంటల్లోనే ఆ దేశాన్ని మోకరిల్లేలా చేశాయి. ఈ విజయానికి మన

వివరాలు 2లో..

## పాక్ ఆర్మీ చీఫ్ అమెరికాలో పర్యటన... రెండు నెలల్లో రెండోసారి



**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అమెరికాలో పర్యటించారు. అక్కడి రాజకీయ, సైనిక ఉన్నతాధి కారులతోపాటు ప్రవాస పాకిస్థానీలతోనూ భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్ విందులో పాల్గొన్న మునీర్.. రెండు నెలల వ్యవధిలోనే మరోసారి అక్కడ పర్యటించారు. ముఖ్యంగా భారత్‌పై అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ తాజా పరిణామం చోటుచేసుకుంది. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అమెరికాలో అధికారిక పర్యటన

వివరాలు 2లో..

## తిరుమలలో వైకాపా మాజీ ఎమ్మెల్యే రాజకీయ వ్యాఖ్యలు.. చర్యలకు సిద్ధమైన తితిదే



**పెన్ పవర్ డెస్క్:** తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పవిత్రతను దెబ్బతీసే విధంగా వైకాపా అధ్యక్షుడు జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి రాజకీయ ఆరోపణలు చేశారు. తితిదే ధర్మకర్తల మండలి ఇటీవల శ్రీవారి ఆలయ పవిత్రతను దృష్టిలో ఉంచుకొని రాజకీయ ప్రసంగాలు, ఆరోపణలు చేయకూడదని నిర్ణయాన్ని అమలు చేశారు. తితిదే నిబంధనలు లెక్కచేయని రవీంద్రనాథ్ రెడ్డి.. ఉదయం శ్రీవారి దర్శనం అనంతరం

వివరాలు 2లో..

## మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలోని హెలిప్యాడ్ లో దిగిన తెలంగాణ మంత్రులు



- ప్రైవేటు కార్యక్రమం కోసం మంగళగిరి వచ్చిన తెలంగాణ మంత్రులు
- జనసేన పార్టీ కార్యాలయం హెలిప్యాడ్‌లో దిగిన హెలికాప్టర్
- ఉప ముఖ్యమంత్రి భట్టి బృందానికి పవన్ కల్యాణ్ తరఫున స్వాగతం
- స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ హరిప్రసాద్
- తిరుగు ప్రయాణంలో మంత్రులకు కొండపల్లి బొమ్మలు బహూకరించిన జనసేన నేతలు
- భట్టితో పాటు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి తదితరుల హాజరు

వివరాలు 2లో..

## అడవి తల్లి బాట గురించి గిరిజన ప్రాంత ప్రజలకు చెప్పండి

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**పెన్ పవర్ డెస్క్::** గిరిజన ప్రాంతాల్లో 'అడవి తల్లి బాట' పేరిట చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రోడ్ల నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, రెండు వారాలకోసారి శాఖాపరంగా సమీక్షించి నిర్మాణ

వివరాలు 2లో..

## పుతిన్ మైండ్‌గేమ్.. అమెరికా గూఢచార సంస్థకు ఇరకాటం!



వివరాలు 2లో..

- అమెరికాకు షాకిచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్
- సీఐఏ ఉన్నతాధికారిణి కుమారుడికి 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పతకం
- రష్యా తరఫున ఉక్రెయిన్ యుద్ధంలో మరణించాడని ప్రకటన
- ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్‌కు పతకాన్ని అందజేత
- ఇది పుతిన్ మైండ్‌గేమ్ అని భావిస్తున్న విశ్లేషకులు
- యువకుడికి మానసిక సమస్యలున్నాయని తెలిపిన సీఐఏ

## పులివెందులలో టీడీపీ వినూత్న ప్రచారం...

- పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికల ప్రచారంలో తీవ్ర ఉత్కంఠ
- ఖైదీల వేషధారణలో వీధుల్లోకి వచ్చిన టీడీపీ కార్యకర్తలు
- "బాబాయిని చంపిన అబ్బాయి బ్యాచ్‌కు ఓటు వేద్దామా?" అంటూ నినాదాలు
- డప్పు వాయిద్యాలతో ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్న టీడీపీ శ్రేణులు
- ఈ నెల 12న జరగనున్న పోలింగ్ కోసం జోరుగా ప్రచారం

వివరాలు 2లో..



## తాండవ ప్రాజెక్టును నీటిని సద్వినియోగం చేసుకోండి



**పెన్ పవర్ డెస్క్:** అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని తాండవ ప్రాజెక్టు నీటిని ఆయకట్టు రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచించారు. హెూం మంత్రి అనితతో కలిసి ఆయన ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. అనంతరం జలహారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఏడాది రూ.2.10 కోట్ల విపత్తు నివారణ నిధితో 18 అభివృద్ధి పనులు చేపట్టామని

వివరాలు 2లో..

## ఎంపీ అవినాశ్‌రెడ్డికి కూటమి నేతలను విమర్శించే హక్కు లేదు

**పెన్ పవర్ డెస్క్:** వైకాపా నేతల వద్ద నోట్లు తీసుకోండి.. తెదేపాకు ఓట్లు వేయండి అంటూ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన పులివెందులలోని తెదేపా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైకాపా నేతలు కూటమి నేతలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. వైకాపా నేతల అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ పులివెందుల అని, గతంలో అక్కడ నామినేషన్ వేసే

వివరాలు 2లో..



## 'సత్వర న్యాయం'.. దేశంలోనే ఏపీని ప్రథమ స్థానంలో నిలబెడతా




**పెన్ పవర్ డెస్క్:** బాధితులకు సత్వర న్యాయం అందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆధునిక సాంకేతిక పోలీసింగ్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి, నిత్యం నిర్దేశిస్తూనే ఉంటారని తెలిపారు. ఏడాది కాలంలో డ్రోన్ పోలీసింగ్, మహిళల భద్రత కోసం శక్తి యాప్, రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతమైన సీసీటీవీ కవరేజ్ వంటి ఆవిష్కరణలతో అద్భుతమైన ఫలితాలొచ్చాయని చెప్పారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రాధాన్యత

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### పాత ఫార్ములాతోనే చంద్రబాబు వెళుతున్నారుగా?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాత ఫార్ములతోనే ఈసారి కూడా ముందుకు వెళుతున్నారు. 2014 ఎన్నికల్లో ఏ ఫార్ములాతో అయితే వెళ్లారో అదే ఫార్ములాను ఈసారి కూడా ఫాలో అవుతున్నారు. ముఖ్యంగా అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. 2027 నాటికల్లా పోలవరం ప్రాజెక్టు నుంచి నీరు అందిస్తామని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. దీనికి మూడేళ్లు గడువు పెట్టారు. అంటే 2028వ సంవత్సరం నాటికి మొదటి దశ అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసే లక్ష్యాన్నిఅధికారులకు నిర్దేశించారు.

**రాజధాని నిర్మాణ పనులు పూర్తయితే...**

అమరావతి రాజధాని నిర్మాణం మొదటి దశ నిర్మాణ పనులు పూర్తయితే కొంత హైప్ వస్తుందని భావిస్తున్నారు. భారీభవనాలతో పాటు అక్కడ అధికారుల నివాసాలకు సంబంధించిన పనులు కూడా పూర్తవుతాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటుందన్న భావన అధికార పార్టీ నేతల్లో ఉంది. అయితే రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టు పొందిన సంస్థలు భవన నిర్మాణ కార్మికులకుగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఉపయోగించడం కొంత విమర్శలకు దారి తీస్తుంది. ఇక్కడ జరుగుతున్న పనుల్లో ఏపీకి చెందిన భవన నిర్మాణ కార్మికులను వినియోగించుకోవాలన్న డిమాండ్ వినపడుతుంది.

**సాగు, తాగు నీరు అందంచగలిగితే...**

పోలవరం ప్రాజెక్టు పనులు కూడా ప్రస్తుతం ఎనభై శాతం పూర్తయ్యాయయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. 2027 నాటికిపనులు పూర్తి చేసి ఖరీఫ్ సీజన్ కు సాగు నీరు అందించగలిగితే చాలా వరకూ ప్రభుత్వం సక్సెస్ అయినట్లే. ముఖ్యంగా రైతులు ప్రయోజనం పొంది కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడే అవకాశముందని అంటున్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టు సంస్థల యాజమాన్యాలకు కూడా హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేయడమే కాకుండా రైతులకు సాగు నీరు అందించడంతో పాటుగా కొన్ని ప్రాంతాలకు తాగు నీటి సౌకర్యం కూడా కల్పించాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు అధికారుల వెంట పడుతున్నారు.

**భారీ వర్షాలు, వరదలకు...**

కానీ భారీ వర్షాలకు రెండు పనులకు ఆటంకంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. రాజధాని అమరావతిలో ఇంకా వర్షపు నీటిని తోడేందుకు మోటార్లను ముమ్మరంగా వినియోగిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ పోటెత్తతుతున్న వరద పనులకు ఆటంకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అనుకున్న లక్ష్యానికి పోలవరం, అమరావతి పనులు పూర్తవుతాయా? లేదా? అన్న సందేహం కొంత అధికార పార్టీ నేతల్లో కనిపిస్తుంది. జమిలి ఎన్నికలు వస్తే ముందుగానే ఎన్నికలు వస్తే ఇక పనులు అసంపూర్తిగా నిలిచిపోతాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. అందుకే చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ఈ ఫార్ములా అనుకూలంగా పనిచేస్తుందా? లేదా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

# ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక..
# 'మేక్ ఇన్ ఇండియా'

- మొదటి పేజీ తరువాయి

టెక్నాలజీ, రక్షణా రంగంలో 'మేక్ ఇన్ ఇండియా' శక్తి దోహదపడ్డాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. 2014కు ముందు కేవలం ఐదు నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు.. నేడు 24 నగరాలకు విస్తరించాయన్నారు.

**కేంద్రం కంటే ఎక్కువ ఖర్చు: సిద్ధరామయ్య**

బెంగళూరు మెట్రో కోసం కేంద్రం కంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఈమేరకు మాట్లాడారు. "ఒప్పందం ప్రకారం మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం, రాష్ట్రం సమానంగా నిధులు సమకూర్చాల్సి ఉంది. అయినప్పటికీ.. రాష్ట్రం ఎక్కువ ఖర్చు చేస్తోంది" అని తెలిపారు. అభివృద్ధి విషయంలో మహారాష్ట్ర, గుజరాత్‌ల మాదిరే కర్ణాటకకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

బెంగళూరు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అంతకుముందు బెంగళూరు-బెళగావి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచే వర్చువల్‌గా అమృత్‌సర్-కాట్రా, నాగ్‌పూర్-పుణె వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపారు. బెంగళూరు-బెళగావి వందేభారత్ రైలులో ప్రయాణించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా.. నగరంలోని ఆర్‌వీరోడ్డు- బొమ్మసంద్ర మధ్య ఎల్లో లైన్ (19.15 కిలోమీటర్లు) మార్గాన్ని ప్రారంభించారు.

**బెంగళూరులో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ లతో కలిసి ప్రధాని మోదీ మెట్రో రైడ్**

కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తరచూ తీవ్ర విమర్శలు చేసే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు... ఆయనతో ఎంతో ఆప్యాయంగా, నవ్వుతూ మాట్లాడటం విశేషం. బెంగళూరులో జరిగిన మెట్రో ప్రారంభోత్సవ వేడుక ఈ అరుదైన సన్నివేశానికి వేదికైంది. ఆదివారం నాడు బెంగళూరులో ఎల్లో లైన్ మెట్రో సేవల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌వీ రోడ్ మెట్రో స్టేషన్‌లో ప్రధానికి స్వాగతం పలికిన సీఎం సిద్ధరామయ్య.. పుష్పగుచ్ఛం అందిస్తూ ఆయన చేతిని పట్టుకుని ఆప్యాయంగా పలకరించారు. ఇక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అయితే, ప్రాజెక్టు వివరాలను ప్రధానికి ఎంతో ఉత్సాహంగా వివరించారు. కార్యక్రమం పూర్తయ్యాక ముగ్గురు నేతలు కలిసి కొత్త మెట్రో రైలులో ప్రయాణించారు.

ఆర్‌వీ రోడ్ స్టేషన్ నుంచి బొమ్మనహళ్లి వరకు సాగిన 19.15 కిలోమీటర్ల ఈ ప్రయాణంలో ప్రధాని మోదీకి ఇరువైపులా సిద్ధరామయ్య, శివకుమార్‌లు కూర్చున్నారు. ప్రయాణమంతా ముగ్గురూ ఎంతో సరదాగా ముచ్చటించుకున్నారు. డీకే శివకుమార్ మెట్రో రైలు నుంచి బయటకు చూపిస్తూ ప్రధానికి పలు విషయాలు వివరిస్తున్న దృశ్యాలు కనిపించాయి.

నేతల మధ్య నవ్వులు విరిశాయి. రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి వారు ఇలా కలిసిపోయి ముచ్చటించుకోవడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముందు ప్రధాని మోదీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి టికెట్ కొనుగోలు చేశారు. అనంతరం ఎల్లో లైన్ మెట్రో సేవలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ మార్గం బెంగళూరు సెంట్రల్ డిస్ట్రిక్ట్‌ను టెక్ హబ్ అయిన ఎలక్ట్రానిక్స్ సిటీతో కలుపుతుంది. ప్రధానితో పాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 16 మంది విద్యార్థినులు, 8 మంది చిన్నారులు, 8 మంది మెట్రో కార్మికులకు ఈ రైలులో ప్రయాణించే అవకాశం దక్కింది. ప్రయాణంలో వారితో కూడా ప్రధాని ముచ్చటించారు.

## పులివెందులలో టీడీపీ వినూత్న ప్రచారం...

పులివెందులలో జరగనున్న జడ్పీటీసీ ఉపఎన్నికల వేడి మామూలుగా లేదు. జరగుతున్నది జడ్పీటీసీ ఉప ఎన్నికే అయినా, అసెంబ్లీ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నంత తీవ్ర వాతావరణం నెలకొంది. ప్రచార పర్వంలో టీడీపీ శ్రేణులు వినూత్నంగా ముందుకుపోతున్నాయి. టీడీపీ కార్యకర్తలు ఖైదీల వేషాలు ధరించి, డప్పులు వాయిస్తూ వీధుల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఈ నెల 12వ తేదీన జరగనున్న జడ్పీటీసీ స్థానానికి సంబంధించిన ఉపఎన్నికల పోలింగ్ కోసం ఈ ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా, "బాబాయిని చంపిన అబ్బాయి బ్యాచ్ కు ఓటు వేద్దామా?" అనే నినాదాన్ని టీడీపీ తమ ప్రచారంలో ప్రధాన అస్త్రంగా ఎంచుకుంది. పులివెందులలోని పలు ప్రాంతాల్లో

టీడీపీ కార్యకర్తలు ఈ ప్రత్యేకమైన వేషధారణలో డప్పు వాయిద్యాల మధ్య నినాదాలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రచార సరళి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఖైదీల దుస్తుల్లో ఉన్న కార్యకర్తలు డప్పులు కొడుతూ ముందుకు సాగుతుండగా, మరికొందరు ఈ నినాదాన్ని గట్టిగా నినదిస్తున్నారు. ఈ వినూత్న ప్రచారానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలోని హెలిప్యాడ్ లో దిగిన తెలంగాణ మంత్రులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి అద్దం పట్టే ఆసక్తికర పరిణామం ఆదివారం మంగళగిరిలో చోటుచేసుకుంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో మంగళగిరి వచ్చారు. వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ నేరుగా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి ఉన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తరఫున శాసనమండలిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, ఇతర జనసేన నాయకులు తెలంగాణ మంత్రులకు సాదరంగా

స్వాగతం పలికారు. అనంతరం వారంతా మంగళగిరిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తెలంగాణ మంత్రులు తిరుగు ప్రయాణమయ్యేందుకు తిరిగి జనసేన కార్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా వారితో కలిశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా పంపిన, తెలుగు సంస్కృతికి ప్రతీకలైన కొండపల్లి బొమ్మల జ్ఞాపికలను తెలంగాణ మంత్రులకు బహూకరించి జనసేన నాయకులు వీడ్కోలు పలికారు.

## పుతిన్ మైండ్‌గేమ్.. అమెరికా గూఢచార సంస్థకు ఇరకాటం!

అంతర్జాతీయ రాజకీయాల్లో తనదైన శైలితో ప్రత్యర్థులకు చుక్కలు చూపే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, తాజాగా అమెరికాను ఇరుకునపెట్టేలా సంచలన ఎత్తుగడ వేశారు. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్‌నే లక్ష్యంగా చేసుకుని ఆయన ఆడిన మైండ్‌గేమ్‌తో వాషింగ్టన్ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరఫున ప్రత్యేక దూతగా క్రెమ్లిన్‌కు వచ్చిన స్టీవ్ విట్కాఫ్‌తో సమావేశమైన పుతిన్, ఓ అనూహ్య బహుమతిని ఆయన చేతికి అందించి కలకలం రేపారు. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్ జూలియన్ గల్లినా కుమారుడైన మైఖెల్ గ్లోస్‌కు 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పతకాన్ని బహూకరిస్తున్నట్లు పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతూ మైఖెల్ వీరమరణం పొందాడని, ఆయన ధైర్యసాహసాలకు గుర్తుగా ఈ పతకాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఈ పతకాన్ని జూలియన్‌కు చేరవేయాలని విట్కాఫ్‌ను పుతిన్ కోరారు. ఈ చర్యతో అమెరికా గూఢచార వర్గాల్లోనే అనుమానాలు రేకెత్తించాలని, అమెరికాను ఆత్మరక్షణలోకి నెట్టాలని పుతిన్ ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది. ఈ సంఘటన వెనుక పుతిన్ ఉద్దేశం అమెరికా సీఐఏ ఉన్నతాధికారిణి కుమారుడు రష్యా పక్షాన యుద్ధంలో పాల్గొన్నాడనే ప్రశ్నలను లేవనెత్తడమేనని నిపుణులు అనుమానిస్తున్నారుమైఖెల్ గ్లోస్ గతంలో సోషల్ మీడియాలో రష్యాకు మద్దతుగా పోస్టులు పెట్టాడని, మాస్కోలో ఉన్న చిత్రాలు కూడా బయటకు వచ్చాయని సమాచారం. అతడు 2024 ఏప్రిల్‌లో తూర్పు ఐరోపాలో మరణించినట్లు వార్తలొచ్చాయి. మైఖెల్ మృతదేహం అమెరికాకు చేరిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో సీఐఏ ఓ ప్రకటన విడుదల చేసింది. మైఖెల్ మరణానికి, జాతీయ భద్రతకు ఎలాంటి సంబంధం లేదని, అతడు కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని ఆ ప్రకటనలో పేర్కొంది. పుతిన్ ఇచ్చిన పతకాన్ని విట్కాఫ్ స్వీకరించారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై అటు రష్యా గానీ, ఇటు అమెరికా, సీఐఏ లేదా విట్కాఫ్ వర్గాలు గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. కేవలం అమెరికాను రెచ్చగొట్టేందుకే పుతిన్ ఈ చర్యకు పాల్పడ్డారని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అడవి తల్లి బాట గురించి గిరిజన ప్రాంత ప్రజలకు చెప్పండి

- మొదటి పేజీ తరువాయి

పురోగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల స్థితిగతులపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో పవన్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం జన్ మన్ పథకంతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి రూ.1005 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. 'అడవి తల్లి బాట' పేరుతో రెండు దశల్లో చేపట్టిన పనుల్లో స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు రహదారి సౌకర్యం లేని గిరిజన ఆవాసాలను సైతం అనుసంధానించేలా రోడ్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పవన్‌కు అధికారులు తెలిపారు. ఈ పనుల పురోగతిని వివరిస్తూ పనులు వేగంగా చేయడానికి ఎదురవుతున్న సవాళ్లను, అవరోధాలను వివరించారు. కొండలపై ఉన్న ఆవాసాలను అనుసంధానిస్తూ కొత్త రోడ్డు రూపకల్పన చేసేందుకు బండరాళ్లను బద్దలు కొడుతూ ముందుకు వెళ్లేందుకు అధిక సమయం పడుతోందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తూ ఉండటంతో పనుల వేగం తగ్గిందన్నారు. 128 రోడ్లు.. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉండడం వల్ల అటవీశాఖ అనుమతులు కోరగా ఇప్పటికే 98 రోడ్లకు వచ్చాయని వెల్లడించారు. ఇప్పటి వరకు 186 పనులు చేపట్టగా, మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నట్టు అధికారులు వివరించారు. గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన ఈ పనుల గురించి స్థానికులకు కూడా తెలియజేయడం ఎంతో అవసరమని పవన్ అన్నారు. డోలీరహిత ఆవాసాలు ఉండాలనే సంకల్పంతో చేపట్టిన విషయాన్ని వారికీ చెప్పాలని తద్వారా వారి సహకారం, ప్రోత్సాహం కూడా లభిస్తుందని చెప్పారు.

## వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది

- మొదటి పేజీ తరువాయి

దూరానికి మార్చారు. బూత్ కబ్జా, రిగ్గింగ్‌కు ఆస్కారం కల్పించారు" అని ఆయన విమర్శించారు. పోలింగ్ రోజున మీడియా కవరేజీని నియంత్రించి, తమ దాడులు, దౌర్జన్యాలు బయటకు రాకుండా చూడాలని టీడీపీ ప్లాన్ చేస్తోందని జగన్ అన్నారు. "నిజం చెప్పాలంటే వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది. అయినా నాకు దేవుడిపై, ప్రజలపై నమ్మకం ఉంది. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది" అని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## తాండవ ప్రాజెక్టును నీటిని సద్వినియోగం చేసుకోండి

- మొదటి పేజీ తరువాయి

స్పీకర్ తెలిపారు. ఆయకట్టుకు 2 నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టును తెదేపా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.

## తిరుమలలో వైకాపా మాజీ ఎమ్మెల్యే రాజకీయ వ్యాఖ్యలు.. చర్యలకు సిద్ధమైన తితిదే

- మొదటి పేజీ తరువాయి

ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఇష్టానుసారం రాజకీయ వ్యాఖ్యలు చేశారు. అతని వ్యాఖ్యలను తితిదే విజిలెన్స్ విభాగం పరిశీలిస్తోంది. బోర్డు తీర్మానాన్ని ఉల్లంఘించినందుకు అతనిపై చర్యలకు సిద్ధమవుతోంది.

## ఎంపీ అవినాశ్‌రెడ్డికి కూటమి నేతలను విమర్శించే హక్కు లేదు

- మొదటి పేజీ తరువాయి

పరిస్థితి లేదన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డికి కూటమి నేతలను విమర్శించే హక్కు లేదన్నారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మండలం రాయలపురంలో సోమవారం జడ్పీటీసీ ఉప ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో కూటమి నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన మీడియాతో మాట్లాడారు.

## 'సత్వర న్యాయం'.. దేశంలోనే ఏపీని ప్రథమ స్థానంలో నిలబెడతా

- మొదటి పేజీ తరువాయి

ప్రాతిపదికన దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. కేవలం రెండు నుంచి ఆరు నెలల రికార్డు సమయంలోనే దోషులుగా తేల్చి.. న్యాయం వేగంగా అందేలా చూస్తున్నామన్నారు. ప్రజా నమ్మకం, భద్రత, సంక్షేమాన్ని పెంపొందించే ఏకైక లక్ష్యంతో విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్ పని చేస్తోందని హెూం మంత్రి అనిత స్పష్టం చేశారు.

## పాక్ ఆర్మీ చీఫ్ అమెరికాలో పర్యటన... రెండు నెలల్లో రెండోసారి

- మొదటి పేజీ తరువాయి

చేస్తున్నట్లు పాక్ ఆర్మీ ఓ ప్రకటన చేసింది. అయితే, ఆయన ఎప్పుడు చేరుకున్నారు? ఎన్ని రోజులు ఉంటారనే విషయాలను వెల్లడించలేదు. యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ జనరల్ మైఖేల్ ఈ. కురిల్లా పదవీవిరమణ కార్యక్రమంలో మునీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సైనిక సహకారంలో కురిల్లా నాయకత్వం ఎంతగానో దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా యూఎస్‌కు చెందిన ఇతర సైనికాధికారులతో మునీర్ భేటీ అయ్యారు. పాక్ ప్రవాసులతో ముచ్చటించిన మునీర్, పాక్‌కు మంచి భవిష్యత్తు ఉందని, పెట్టుబడులు తేవడంలో సహకరించాలని చెప్పారు. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ జూన్‌లోనూ అమెరికాలో పర్యటించారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తోనూ విందు చేశారు. ఓ ఆర్మీ చీఫ్‌కు అమెరికా అధ్యక్షుడు విందు ఇవ్వడం అత్యంత అరుదు. అప్పట్లో భారత్ అభ్యంతరాల్ని బేఖాతరు చేస్తూ జరిగిన ఆ సమావేశంలో ఇరు దేశాలు వివిధ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# స్తంభాలు వదిలేసారు



**ఏలూరు ఆగస్టు 10 పెన్ పవర్ :** ఈ చిత్రం పెదవేగి మండలం జగన్నాధపురం గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ అభివృద్ధి పనుల నిమిత్తం తీసుకొచ్చిన స్తంభాలు. చాలా రోజులుగా వాటర్ ట్యాంక్ వద్ద రోడ్డు పక్కనే పడేశారు. వాటిని నిలబెట్టి విద్యుత్ తీగల అనుసంధానం ఎప్పుడు చేస్తారా అని స్థానికులు నిరీక్షిస్తున్నారు. ఎస్పీడీసీఎల్ పెదవేగి గ్రామీణ ఏఈ స్పందించి సంబంధిత నిర్మాణపు విభాగం దృష్టికి తీసుకెళ్లి వాటిని ఉపయోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# జాతీయ జెండాను గౌరవించాలి







**గోపాలపురం,పెన్ పవర్, ఆగస్టు 10:**జాతీయ జెండాను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఎంపీడీవో రాజ్ మనోహర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఆదివారం గోపాలపురంలో నిర్వహించారు. ఎంపీడీవో రాజ్ మనోహర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం నుండి చెక్ పోస్ట్ సెంటర్లో నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడడంతోపాటు జాతీయ జెండాను గౌరవించాలన్నారు. అభివృద్ధి లో పాలుపంచుకోవాలని సూచించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు వాడవాడల ఘనంగా జరుపుకోవాలని అన్నారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# ముందు గడ్డిమేటు.. తర్వాత శాశ్వతపాగా !





- తమ్మిలేరు ఏటుగటు అంచుల్లో ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు

**ఏలూరు ఆగస్టు 10 పెన్ పవర్:** ఏలూరు నగరపాలక సంస్థ 18వ డివిజన్ తమ్మిలేరు లాకుల నుండి కొత్తూరు బ్రిడ్జి వరకు తమ్మిలేరు అంచుల వెంబడి ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. జె లవనరుల శాఖ అధికారులను ఇదేమని ప్రశ్నిస్తే సరిపడా సిబ్బంది లేరని, ఆక్రమణల విషయం తమ దృష్టికి రాలేదని సాకుగా చెబుతున్నారు. అదేవిధంగా లాక్ నుండి పోణంగి వెళ్లే పంట కాలువ గట్టు వెంబడి ఆక్రమణదారులు రహదారి మార్జిన్లలో ఏకంగా దుకాణాలు నిర్మించేస్తున్నారు. గొల్లగూడెం రాజీవ్ గృహకల్ప కాలనీ వాటర్ ట్యాంక్ నుండి వంగాయిగూడెం అంబేద్కర్ భవనం వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి శాశ్వత కట్టడాలు కట్టి అమ్మకాలను సాగిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణాలు మరింత జోరు అందుకున్నాయి. జల వనరుల శాఖ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఆక్రమణలు తొలగించాల్సి ఉందని కాలనీ ప్రజలు చెబుతున్నారు. రాజీవ్ గృహకల్ప కాలనీ లేఅవుట్లో ఇచ్చిన స్థలాలు కన్నా, ప్రస్తుతం ఆక్రమణదారుల నివాస గృహాలే ఎక్కువగా ఉన్నాయని, కాలనీలో సామాజిక స్థలాలను కూడా ఆక్రమణకు గురైనా నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప పట్టించుకోవడం లేదు అని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

# రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం





## 300 మందికి వైద్య పరీక్షలు

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 10:**రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల అధ్వర్యంలో రంపచోడవరం సిరిగిందలపాడు లో ఆదివారం వైద్య శిభిరం నిర్వహించినట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు.ఈ వైద్య శిబిరం లో రామకృష్ణ మిషన్ క్యాంపు ఇన్చార్జి స్వామి లోకమయనంద జీ మహారాజ్, స్వామి మృడాత్మనంద మహారాజ్, పాల్గోని వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరం లో వైద్యనిపుణులు డాక్టర్ తలారి సుబ్బరావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ పోతుల రామారావు పాల్గొని సుమారు 300మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. అవసరం అయిన వారికి 66మందికి రక్తపరీక్షలు, 08మందికి ఇ.సి.జి. 06గురుకి థైరాయిడ్ పరీక్షలు, 15మందికి ఫిజియోథెరపీ, చేసినట్లు స్వామీజి తెలిపారు. వేమగిరి చెందిన పరమహంస యోగానంద నేత్రలయం వారిచే కంటి వైద్యశిబిరం నిర్వహించి 59మందికి కంటి పరీక్షలు చేసి 19మందికి కళ్లజోళ్లు అందించారు. కంటి ఆపరేషన్ల నిమితం 9గురుని వేమగిరిపరమహంసయోగానంద నేత్రలయం తరలించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్.పోతుల రామారావు గుండె జబ్బులు మరియు రక్తపోటు, మధుమేహ%శీ%, వ్యాధి గ్రస్తులకు అవగాహన కల్పించారు. రామ కృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు సహాయకులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో – ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ , సిబ్బంది పాల్గొన్నారు.



# గొల్లపాలెంలో ఘనంగా టీడీపీ నేత నక్కా శ్రీను జన్మదిన వేడుకలు





**కాజులూరు, ఆగస్టు 10 పెన్ పవర్ :**మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు, టీడీపీ నేత నక్కా శ్రీను జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రు వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో జరిగింది. భారీ కేక్ కట్ చేస్తూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, చంద్రు వీర్రాజు చౌదరి, కొల్లు హనుమంతరావు చౌదరి (ఆర్యవటం), క్లస్టర్ ఇన్‌ఛార్జ్ సలాది సాయిబాబు, గొల్లపాలెం సొసైటీ అధ్యక్షులు అంగర కృష్ణగౌడ్, తోట కృష్ణ, ఆర్యవటం సొసైటీ అధ్యక్షులు కోట తాతబ్బాయి, పెంకె అప్పారావు, పుణ్యమంతుల రామకృష్ణ (మంజేరు), అంగర కృష్ణ, వనమాడి శ్రీను, మాధవరపు శ్రీరాంమూర్తి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.హాజరైన నేతలు నక్కా శ్రీనుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో, పార్టీ సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# మరిడమ్మకు చాగంటి దంపతుల పూజలు



**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్ట్ 10 :** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకోగా వేద పండితుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, దేవస్థానం సిబ్బంది వారికి శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



# అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల సమన్వయ దాడులు

**ఆత్రేయపురం,పెన్ పవర్ ఆగస్టు 10:**జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల తో, డిఎస్పి సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో, సిఐ సీహెచ్.విద్యాసాగర్ పర్యవేక్షణలో అసాంఘిక కార్యకలాపాలపై విస్తృత కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఆలమూరు ఎస్సై జి.నరేష్, ఆత్రేయపురం ఎస్సై రాము, కొత్తపేట ఎస్సై సురేంద్రల సమన్వయంతో ఆదివారం ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు జొన్నాడ తారకరామా కాలనీలో నాలుగు వైపులా ముట్టడి చేసి దాడులు జరిపారు.ఈ చర్యల్లో రికార్డులు లేని 25 బైకులు, 4 కార్లు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. ఏ ఒక్కరు తప్పించుకోకుండా ఉండేందుకు డ్రోన్ కెమెరాలతో ఏరియల్ సర్వే నిర్వహించారు. నాటు సారా తయారీ, గంజాయి, డ్రగ్స్ విక్రయాలు వంటి కార్యకలాపాలు వెలుగులో వస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.
వాహనాల యజమానులు సరైన రికార్డులు సమర్పిస్తే వాటిని తిరిగి ఇచ్చే విధానం అమల్లో ఉంటుందని, లేకపోతే వాటిని సీజ్ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ తరహా కార్డన్ సెర్చ్‌లు ప్రతి గ్రామంలో కొనసాగుతాయని, ప్రజలు అసాంఘిక చర్యలపై సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలని, సమాచారదాతల పేర్లు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

# ఫిషింగ్ హర్బర్లో 100 కేజీల సొర చేప...



**అమలాపురం పెన్ పవర్, ఆగస్టు 10:**డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం ఫిషింగ్ ఆర్బర్ లో సముద్ర వేటకు వెళ్ళిన బోటు మాత్యకారులకు అరుదైన సొర చేప లభించింది. సుమారు 100 కేజీలకు పైనే ఉంటుందని, పాట పెట్టగా దాని వేల 8 వేల 800 లకు పలుకగా వ్యాపారస్తులు సొంతం చేసుకొన్నారు. స్థానికులు పెద్ద సొర చేప ను చూసుటకు ఎగబడ్డారు.

# కిడ్నాప్ కేసును చేదించిన పోలీసులు...



- శరభవరం సచివాలయ ఉద్యోగి కిడ్నాప్ కేసులో మలుపు..
- ముగ్గురు ప్రధాన నిందితులు అదుపులో– మరో ఇద్దరు పరారీలో..
- నిందితులను రిమాండ్‌కు హాజరు పరచనున్న పోలీసులు..
- రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్ వెల్లడి...

**దేవీపట్నం,పెన్ పవర్,ఆగస్టు10:**దేవీపట్నం మండలం శరభవరం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సోయం శ్రీ సౌమ్య కిడ్నాప్ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.ఆదివారం రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డీఎస్పీ సాయి ప్రశాంత్ ఈ వివరాలను మీడియాతో పంచుకున్నారు.ఈ నెల 7వ తేదీన చోటు చేసుకున్న ఈ ఘటనలో నిందితులు సోయం శ్రీ సౌమ్యను కిడ్నాప్ చేసి,జగ్గంపేట సమీపంలో వాహనాన్ని వదిలి,అక్కడి నుండి మరో వాహనంలో ఆమెను తీసుకెళ్లినట్లు తెలిపారు. పట్టుబడిన చోటు వై.రామవరం మండలం పాతకోట గ్రామ సమీపం అని డీఎస్పీ పేర్కొన్నారు.ఈ కేసులో మొత్తం ఐదుగురు నిందితుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకుని,మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.అంతేకాక,ఈ కిడ్నాప్‌కు సహకరించిన మరో ఇద్దరిని కూడా అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.అదుపులో ఉన్న ఐదుగురిని రేపు రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.పోలీసుల తక్షణ చర్యలు,సాంకేతిక ఆధారాలతో పాటు నిఘా వ్యవస్థను ఉపయోగించి నిందితులను అరెస్ట్ చేయగలిగారు.పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని డీఎస్పీ తెలిపారు.

# ఉద్యమాల వల్లే ఉపాధ్యాయులకు ఉనికి



- ఘనంగా యూటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు
- యూటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు రాంబాబు దొర

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 10:** ఉద్యమాల ద్వారానే యుటిఎఫ్ ద్వారా ఉపాధ్యాయులకు గుర్తింపు వచ్చిందని యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు సిహెచ్ రాంబాబు దొర అన్నారు.
1974 లో స్థాపించిన యూటిఎఫ్ 51 సంవత్సరాలు పూర్తి చేసుకుని 52 వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా స్థానిక ఎం ఆర్ సి సమీపంలో యూటిఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం మండల శాఖ అధ్యక్షులు సిహెచ్ రాంబాబు దొర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.
తొలుత యూటిఎఫ్ జెండాను అధ్యక్షులు సిహెచ్ రాంబాబు దొర ఆవిష్కరణ చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు , ఉపాధ్యాయుల సంక్షేమానికి గత 51 సంవత్సరాల యూటిఎఫ్ ప్రస్థానంలో అవిశ్రాంత పోరాటాలు, అసాధారణ విజయాలు సాధనకు యూటిఎఫ్ కృషి చేసిందని అన్నారు.ఆవిర్భావం నుండి నేటి వరకు క్రమశిక్షణ కు మారుపేరుగా, అవినీతి పై రాజీ లేని వైఖరితో సమస్యల సాధనలో పోరాట మార్గంలో పయనిస్తున్నదని అన్నారు.మండల శాఖ సహధ్యక్షులు
కారం బొజ్జిదొర మాట్లాడుతూ
ఉపాధ్యాయ ఉద్యమంలో యుటిఎఫ్ పోషించిన పాత్ర మరువలేనిదని ఉద్యోగం సంపాదించడం మనం చదివిన చదువు ద్వారా వచ్చింది, ఉద్యోగం కాలం లో మనకు లభించిన సౌకర్యాలు, పెన్షన్, రీగ్రీపింగ్ స్కేల్స్, పి ఆర్ సి, డి ఎ సెలవులు, బదిలీలలో కౌన్సిలింగ్ విధానం , ఉద్యోగ భద్రత తదితరాలు ఉద్యమం ద్వారా మాత్రమే లభించయని యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి నేటి వరకు అధికార పక్షం,ప్రతి పక్షం,ఏ పక్షం వైపు ఒదగకుండా ఉపాధ్యాయ, ప్రభుత్వ విద్యా పరిరక్షణ వైపు నిలబడి అనేక రాయితీలు సాధించిన సంఘం యుటిఎఫ్ అని అన్నారు.జెండా ఆవిష్కరణ అనంతరం యూటిఎఫ్ మూల సూత్రాలలో ఒకటైన సామాజిక స్పృహతో




స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో మండల శాఖ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వర రావు, మహిళా అధ్యక్షురాలు ఎల్. రుక్మిణి దేవి, , జిల్లా కౌన్సిలర్ సిహెచ్ రామ కృష్ణా రెడ్డి,సభ్యులు ఎ రాంబాబు, సిహెచ్ సత్యనారాయణ దొర, ఆర్. వెంకటేశ్వరరావు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంబాజీపేటలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు రికార్డు లేని 20 వాహనాలు స్వాధీనం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 10:** సారాయి, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు నివారించేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు తరచుగా కొనసాగిస్తామని సి.ఐ. ఆర్. భీమరాజు అన్నారు.
అంబాజీపేట మెట్ల కాలనీ లో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో పి.గన్నవరం సి.ఐ ఆర్.భీమరాజు పర్యవేక్షణలో సుమారు 25 మంది సిబ్బందితో ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో రికార్డు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సరైన పత్రాలు చూపిస్తే వాహనాలను తిరిగి ఇస్తామని, లేకపోతే వాటిని బ్రేక్ ఇన్స్పెక్టర్‌కు అప్పగిస్తామని సీఐ భీమరాజు తెలిపారు. మారుమూల గ్రామాల్లో సారాయి, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు నివారించేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు తరచుగా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ఆయనతోపాటు అంబాజీపేట ఎసై చిరంజీవి, ట్రైనింగ్ ఎసై గుబ్బల సోమేంద్ర తో పాటు ఎఎసైలు, హెచ్‌సిలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## అద్వాన్నంగా రహదారి అభివృద్ధి చేయండి



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు10:** కొద్దిపాటి వర్షానికే రహదారి పై నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అద్వాన్నంగా ఉన్న రహదారి ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. మాచవరం గ్రామ పంచాయతీ పరిధి మసీదువీధిలో రహదారి అద్వాన్నంగా ఉందని అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం సారు.బాటసారులు, ద్విచక్రవాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.
సమీపంలో నే మసీదు ఉన్నది. ప్రార్ధనలు చేసుకొనేందుకు ముస్లింలు మసీదుకు ఈ రహదారి లోనే చేరుకుంటారు. కూటమి
ప్రభుత్వం రహదారులను అభివృద్ధి కి అధిక ప్రాధాన్యత ను కల్పిస్తుందని నాయకులు, అధికారులు రహదారి ని అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలన్న డిమాండ్‌కు మద్దతు

**కపిలేశ్వరపురం పెన్ పవర్, ఆగస్టు 10:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట అసెంబ్లీ నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా గల తూర్పు గోదావరి జిల్లాలో కలపాలన్న డిమాండ్‌కు మద్దతు పెరుగుతోంది.ఆదివారం అంగర గ్రామంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ కళ్యాణ మండపంలో కాంగ్రెస్ నాయకుడు కామన ప్రభాకర్ రావు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సమావేశంలో బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలా పురం కంటే రాజమహేంద్రవరం కేంద్రం మండపేట నియోజకవర్గ ప్రజలకు భౌగోళికంగా, సౌకర్య పరంగా అనుకూలమని వక్తలు అభిప్రాయపడ్డారు.2006 నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ 'నియోజకవర్గాలు, మండలాలు మధ్య నదులు, కొండలు అడ్డుగా ఉండరాదు' అని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, గోదావరి నది అడ్డుగా ఉన్న మండపేటను కోనసీమ జిల్లాలో ఉంచిన గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం



ఈ అంశాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికే మండపేట నియోజక వర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని కోరుతూ కపిలేశ్వర పురం మండలంలోని మెజార్టీ గ్రామపంచాయతీలు తీర్మానాలు ఆమోదించాయని కామన ప్రభాకర్ రావు, పుత్సల శ్రీనివాస్, మండల సర్పంచ్ శాకా శ్రీనివాస్, రిటైర్డ్ టీచర్ రాఘవులు తెలిపారు. మండపేట ప్రజలకు వైద్యం, వాణిజ్యం, విద్య తదితర రంగాల్లో రాజమహేంద్రవరం నగరంతో దశాబ్దాలుగా సన్నిహిత సంబంధం ఉందని పలువురు వక్తలు గుర్తుచేశారు.సమావేశంలో అఖిలపక్ష నాయకులు జడ్పీటీసీ అబ్బు, అల్లూరి రామకృష్ణ చౌదరి, బి. సత్తిబాబు, జయరాజు, గుడాల జయబాబు, దేవు వెంకటరాజు, వాధా ప్రసాద్, జుతుక మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

- ఎస్ ఏ ఎఫ్ శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ ద్వారా 30వేలు ఆర్ధిక సహాయం

**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు10:** అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామం చినపాలెం లో పితాని రమేష్ గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధి తో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఎస్ ఏ ఎఫ్ సభ్యులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లారు. పితాని రమేష్ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే వైద్య ఖర్చుల నిమిత్తం 20 వేల రూపాయలు ఎస్ ఏ ఎఫ్ సభ్యులకు అందజేశారు. ఎస్ ఏ ఎఫ్ సభ్యులు సమకూర్చిన రూ. 10వేలు కలిపి మొత్తం 30 వేల రూపాయలను ఆదివారం క్యాన్సర్ బాధితుడు పితాని రమేష్ కు అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన మంత్రి సుభాష్ కు రమేష్ ఫ్యామిలీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దొంగ శ్రీను, సంసాని బాలాజీ, చిట్టూరి శ్రీనివాస్, గుత్తుల రాము, మొల్లేటి శ్రీను, కాంద్రేగుల



రాము, యనమదుల మహేష్, కాంద్రేగుల శేఖర్, పిల్లి సురేష్, సానబోయిన అర్జున్ రావు, చోడే యేసు, కూడుపూడి వెంకటేష్, విత్తనాల నాగకిషోర్, మట్టపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

# పశువులు బందెలదొడ్డి ఏర్పాటు చేయండి.





**-రేఖపల్లిలో వ్యవసాయం చేస్తున్న రైతులు**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.10:** మండలంలోని రేఖపల్లి పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ రైతులు వరి నాట్లు వేస్తున్నారని,రేఖపల్లి రైతుల వ్యవసాయ భూమిలో వరినార్లు వేసు కోవడాటాని కి వరినార్లు సిద్దంగా ఉన్నాయని,రాత్రి సమయంలో పశు వులు వచ్చి వరినార్లు ను మేస్తున్నాయని,పశువులను పెం చు కొనేవారు వారి వారి పశువులను జాగ్రత్త చేయాలని, మోడెం నరేష్,కోరారు.ఆగస్టు నెలలో వర్షాలు రాకపోవ డంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.ప్రధాన రహదారులపైన తిరిగే వాహనదారులకు కూడా పశువులు అడ్డంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు ఆరోపిస్తున్నారు.రేఖపల్లి పంచాయితీలో ప్రజలకు తెలియజేసే విధంగా దండోరా వేసి బందెలదొడ్డి పాట పెట్టి,పశువుల బందెలదొడ్డి,ఏర్పాటు చేయాలని, వ్యవసాయ రైతులు వాహనదారులు కోరారు.ఇకనైనా సంబంధిత అధికారులు బందెలదొడ్డి,ను ఏర్పాటు చేయాల ని,వ్యవసాయ రైతులు కోరుతున్నారు.

# ఇస్కాన్ ఆధ్వర్యంలో నూతన సంకీర్తన భవనం ప్రారంభం



**అమలాపురం రూరల్, పెన్ పవర్ ఆగస్టు10:** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘము ఇస్కాన్,జనుపల్లి,అమలాపురం ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంకీర్తన భవనం ప్రారంభోత్సవం జరిగింది. ఈ భవన ప్రారంభోత్సవానికి ఇస్కాన్ రాజమండ్రి మందిర చైర్మన్ శ్రీమాన్ శ్రీ సత్య గోపినాథ్ దాస్,హాజరై య్యారు, వారు ఆధ్యాత్మిక సందేశం అనంతరం శ్రీకృష్ణ జన్మాష్టమి కి కండక్ట్ చేసిన స్కూల్స్ విద్యార్థులకు బహు మతి ప్రదానం జరిగింది. శ్రీ శ్రీ నితాయి, గౌర చంద్రులకు మహాపుష్ప అభిషేకం,మహానైవేద్యం (54 రకాలు) సమర్పించారు.ఈ కార్యక్రమానికి,,జనుపల్లి నుండి వాకపల్లి నాయిడు,రావులచెరువు రామాలయం కమిటీ సభ్యులు,జనుపల్లి గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.ఇస్కన్ అమలాపురం మేనేజర్ శివానంద నిమయి దాస్, వారి భక్త బృందం, కిషోర్ , ఇస్కాన్ సండే స్కూల్ టీచర్ శృత్యకళ పాల్గొన్నారు..ఆగస్ట్ 16 తేదీ శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వరకు జరుగు ఉత్సవాలను భక్తులు సద్వినియోగం చేసుకొనగలరని ఒక ప్రకటనలో తెలిపారు.

# చప్టా వంతెన కృంగి పోవడంతో గేట్లు ఏర్పాటు






- ఎస్.ఐ.సంతోష్,కుమార్,పోలీసు సిబ్బంది.
- ఎస్.ఐ.కు కృతజ్ఞతలు తెలిపిన మండల ప్రజలు

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.10:**మండలంలోని అన్నవరం చప్టా వంతెనపై నుండి బరువై న జామాయల్,లోడ్,టాక్టర్,లు తిరగడంతో చప్టా వంతెన కృంగి పోయి అక్కడక్కడ పగుళ్లు ఏర్పాడిన తర్వాత వర్షం రావడంతో పగిలి పూర్తిగా కృంగి పోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష్, కుమార్,పోలీసు సిబ్బంది.తో కలసి రాత్రి సమయంలో వెళ్లి చప్టా వంతెను పరిశీలించి,వంతెనపైన ఇరువైపులా గేట్లు ఏర్పాటు చేస్తూ చప్టా వంతెనపై నుండి వాహన దారులు వాహనాలు నడప కూడదని,అక్కడ ప్రజలకు వాహన దారులకు ప్రమాదాలు జరిగే చూచనలు ఉన్నా యని,వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష్, కుమార్,ఒక ప్రకటన లో తెలిపారు.అనంతరం చింతూరు,వి.ఆర్.పు రం మండ లాల రాకపోకలు నిలిచి పోయాయి.వి.ఆర్.పురం మండ లప్రజలు వాహనదారులు వి.ఆర్. పురం ఎస్.ఐ.సంతోష్, కుమార్,కు పోలీసు సిబ్బంది.కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్తిపాడులో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ






- రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్న ఎమ్మెల్యే సత్యప్రభ
- మహిళలతో కలిసి వరి నాట్లు నాటిన ఎమ్మెల్యే

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 10 :**కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకం 'అన్నదాత సుఖీభవ' విజయవంతం సందర్భంగా ప్రత్తిపాడులో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ, దివంగత నేత వరుపుల రాజా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.
అనంతరం స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తల సమక్షంలో ప్రత్తిపాడు కేంద్రంలో ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా అధిక సంఖ్యలో ట్రాక్టర్లు పాల్గొన్నాయి. పరిసర గ్రామాల రైతులు తమ ట్రాక్టర్లను పూలతో అలంకరించి, పార్టీ జెండాలు ఎగురవేసి ర్యాలీని మరింత రంజుగా మార్చారు. ర్యాలీ ప్రత్తిపాడు నుండి ప్రారంభమై, అనేక గ్రామాల మీదుగా ప్రయాణించి, చివరగా పెద శంకర్ల పూడి పార్టీ కార్యాలయానికి చేరుకుంది.
ర్యాలీ మార్గమంతా రైతులు, మహిళలు, యువత హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. అన్నదాత సుఖీభవ ద్వారా అందుతున్న ఆర్థిక సాయం, సౌకర్యాలు తమ జీవితాల్లో స్థిరత్వం తీసుకువచ్చాయని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ మాట్లాడుతూ "రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకం, అన్నదాత సుఖీభవతో వ్యవసాయ రంగంలో కొత్త దశ ప్రారంభమైంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రతి రైతు ఈ పథకం ప్రయోజనాలు పొందేలా కృషి చేస్తాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు ఈ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. వందల ట్రాక్టర్లతో సాగిన ఈ ర్యాలీ, ప్రత్తిపాడు రైతాంగ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.

# బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు10:**అధికార దాహం కోసం వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబు సిద్ధహస్తుడని జెడ్పిటీసీ, వైఎస్ఆర్సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాచవరం, మొసలపల్లి గ్రామాల్లో పరిశీలకులు జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మట్టపర్తి బాలాజీల పర్యవేక్షణలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అమలు చేస్తామని. ఆదాయాన్ని సష్టిస్తామని అబద్దాలు చెప్పి గద్దెనెక్కి నేడు పథకాలు అమలు చేయ కుండా రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచాడన్నారు. సంపద సష్టిస్తానని చెప్పి విద్యుత్ చార్జీలను పెంచి పేదలు, రైతులను నిలువునా మోసం చేశాడన్నారు. సంపద సృష్టి పేరుతో గ్రామాల్లో వీధికి నాలుగు బెల్ట్ షాపులను నిర్వహిస్తూ మద్యాన్ని వీరులా పారించి పేదల కష్టాన్ని దోచుకుంటున్నాడన్నారు. చంద్రబాబుకు పేదలు సంతోషంగా ఉంటే నచ్చదని పేదలను అణగదొక్కేందుకు ఎల్లపుడూ చూస్తుంటాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా సక్రమంగా అమలు చేయలేకపోయారన్నారు. దానికితోడు నిత్యం వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రగా మార్చారన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రాష్ట్ర నాయకులు పి.కె.రావు. మండపాటి కిరన్ కుమార్ లు మాట్లాడుతూ బాబు నయవంచన పాలనను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం చంద్రబాబుస్ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సర్వమోహన్, కుసుమ వరలక్ష్మి, కొర్లపాటి కోటబాబు, చట్టపర్తి హరి, మైల ఆనందరావు, కోట సత్తిబాబు, పులపర్తి గంగరాజు, కుసుమ శ్రీనివాస్, గోసంగి, సత్యనారాయణ పాల్గొన్నారు

# ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 10:**యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ శాఖ మండల అధ్యక్షుడు ఎం. సూర్యనారాయణ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు కేతా గంగాధరం పతాకాన్ని ఎగురవేశారు. కార్యదర్శి పి.విశ్వప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ యూటీఎఫ్ అధ్యయనం. అధ్యాపనం, సామాజిక సుహ అనే సూత్రాలతో పనిచేస్తోందని వివరించారు. ఉపాధ్యాయులకు అనవసర ఒత్తిడి బోధనేతర పనులను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో దాకే చంద్రబాను, ముప్పి పుల్లయ్యశెట్టి, మట్టపర్తి రాంబాబు, బీర రామాంజనేయులు, పితాని శ్రీనివాస్, పరమటి ఏడుకొండలు, బెహరా మూర్తి పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు గ్రామంలో గీత కార్మికుల కృతజ్ఞత సభ...

- ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, లోకేష్, ఎమ్మెల్యే ఫోటోలకు పాలాభిషేకం






**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 10 :** గ్రామంలో ఆదివారం గీత కార్మికులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తమ సంక్షేమం కోసం చేపట్టిన పలు మేలుచేసే కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలు వారికి ఉపశమనం కలిగించాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన చింతాకుల భాస్కరరావు మాట్లాడుతూ, "మా శేట్టిబలిజ కులస్థుల పట్ల ఈ ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధికి రుణపడి ఉన్నట్టే. కూటమి ప్రభుత్వం మరెన్నో విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం" అన్నారు. ఆయనతో పాటు పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా గీత కార్మికుల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, ఈ కృతజ్ఞత సభ ప్రభుత్వానికి ధన్యవాద సూచకంగా నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహంగా సాగింది. జై తెలుగు దేశం, జై చంద్రబాబు, జై పవన్ కళ్యాణ్, జై లోకేశ్, జై సత్యాప్రభ అంటూ నినాదాలు ప్రతిధ్వనించాయి.ఈ కార్యక్రమంలో కొ. పిశెట్టి సుధీర్, మానియ్య, ఇంకా మండల స్థాయిలో గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు కూడా హాజరై వేడుకలో భాగమయ్యారు.

# ప్రత్తిపాడు మండలంలో యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం





**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 10 :** మండలంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 52వ ఆవిర్భావ దినోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. మండల యుటిఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీను ఆధ్వర్యంలో ప్రత్తిపాడు కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యుటిఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం అర్ధ శతాబ్దానికి పైగా పోరాట పంథాను కొనసాగిస్తున్నదని, భవిష్యత్తులో కూడా అదే దిశగా కదిలి అన్ని పెండింగ్ సమస్యల పరిష్కారం సాధించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు, పిఆర్సి కమిటీ సిఫారసుల అమలు, ఆర్థిక బకాయిల విడుదల వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేదంటే తీవ్ర ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమని, అందరూ సంఘబలం ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు కూడా, తమ హక్కుల సాధన కోసం యుటిఎఫ్‌తో భుజం తగిలించి నిలబడతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎఫ్ డబ్ల్యు ఎస్ డైరెక్టర్ ఆర్. రామలింగేశ్వరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సిహెచ్.ఎల్. గణేష్, జనరల్ సెక్రటరీ దొడ్డిపట్ల రాజబాబు, సి.హెచ్. సూర్యవతి, ఎం.వి. రమణ, ఎస్. నాగేశ్వరరావు, ఎం. స్వామికుమార్, లక్ష్మీనారాయణ, తాతబ్బాయి తదితరులు హాజరై కార్యక్రమానికి ప్రత్యేకత చేకూర్చారు.

# ఆత్రేయపురంలో ఘనంగా 52వ యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



**ఆత్రేయపురం,పెన్ పవర్ ఆగస్టు 10:**ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం 52వ యుటిఎఫ్ (ఉపాధ్యాయుల సంఘం) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి జిల్లా యుటిఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ కొప్పిశెట్టి శ్రీనివాస్ ప్రధాన అతిథిగా హాజరై పతాకావిష్కరణ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయ లోకానికి యుటిఎఫ్ అందించిన విశిష్ట సేవలు, విద్యా రంగ అభివృద్ధి కోసం పోరాట చరిత్రను వివరించారు.
ఈ వేడుకలో మండల శాఖ అధ్యక్షుడు టి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్. సుధాకర బాబు, గౌరవాధ్యక్షులు సరిదే ప్రసాద్, కోశాధికారి కదలి ప్రసాద్, సహాధ్యక్షురాలు డిడి. లక్ష్మీదేవి, జిల్లా కౌన్సిలర్లు చిప్పాడ సత్యనారాయణ, సిహెచ్.వి.ఎల్.కె. దుర్గ, కార్యవర్గ సభ్యులు కారింకి ప్రసాద్, సానబోయిన సాయిరాం, బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వక్తలు యుటిఎఫ్ ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధనలో పోషించిన పాత్రను గుర్తుచేసి, భవిష్యత్తులోనూ విద్యా రంగ అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# అప్రోచ్ వేయరూ..



**ఏలూరు ఆగస్టు 10 పెన్ పవర్ :** నగరంలోని 18వ డివిజన్ రాజీవ్ గృహకల్ప కాలనీ ఓ హెచ్ ఆర్ ట్యాంక్ కు వెళ్లే మార్గంలో రహదారి అప్రోచ్ దెబ్బతిని ఏళ్లు గడుస్తున్న నగరపాలక ఇంజనీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడంలేదని, వాహనాలు కుదుపునకు లోనై చోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో నగరపాలక పాఠశాలకు సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు. నగరపాలక ఇంజనీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకొని అప్రోచ్ ను వేయాలని కాలనీవాసులు కోరుచున్నారు.

# సొసైటీ అధ్యక్షులుగా రమేష్,హరిబాబు





**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 10** :మండలంలోని గోపాలపురం సొసైటీ అధ్యక్షులుగా వాదాలకుంట గ్రామానికి చెందిన వడ్లమూడి రమేష్,చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షులుగా చిట్యాల గ్రామానికి చెందిన గద్దె హరిబాబు ను ఎంపిక చేసినట్లు స్థానిక శాసనసభ్యుల కార్యాలయం నుండి ఆదివారం ప్రకటన వెలువడింది.నియోజకవర్గంలోని గోపాలపురం,దేవరపల్లి,నల్లజర్ల,ద్వారకాతిరుమల మండలాల పరిధిలో ఉన్న సొసైటీల అధ్యక్షులుగా కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులను ఎంపిక చేశారు. అందులో భాగంగా గోపాలపురం మండలంలో ఈ రెండు సొసైటీలు ఉండగా వాటికి రమేష్,హరిబాబులను అధ్యక్షులుగా నియమించారు.రమేష్ గత కొన్ని ఏళ్లగా టిడిపిలో ప్రముఖ నాయకుడిగా ఉంటూ పార్టీ విజయంలో కీలక పాత్ర పోషిస్తూ ఉండడంతో ఈ పదవికి ఎంపిక చేసినట్లు తెలిసింది.అలాగే హరిబాబు అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు కావడం గతంలో టిడిపి మండల శాఖ అధ్యక్షునిగా పనిచేసి పార్టీకి విశేష సేవలు అందించడంతో ఈ పదవి దక్కింది.ఇదిలా ఉంటే సొసైటీకి త్రీ సభ్య కమిటీలు ఏర్పాటు చేయడం కారణంగా గోపాలపురం సొసైటీకి అధ్యక్షుడిగా రమేష్ సభ్యులుగా ముత్యాల రాయుడు,ప్రగడ రాంబాబు,చెరుకు మిల్లి సొసైటీ అధ్యక్షుడిగా హరిబాబు సభ్యులుగా గరికిసూటి పెద్ద సత్యనారాయణ,పగడాల నరసింహమూర్తిలను ఎంపిక చేయడం పట్ల పలువురు అభినందనలు తెలియజేసారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 10** :మండల పరిధిలోని వెంకటాయపాలెం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు.కుమారుడి మరణ వార్త విని తండ్రి మృతి చెందడంతో వాదాలకుంట,పెద్దేవం గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.వివరాల్లోకి వెళితే వాదాలకుంట గ్రామానికి చెందిన మరపట్ల సువర్ణ రాజు (56) తాళ్లపూడి మండలం బల్లిపాడు గ్రామం బంధువుల శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే మండలం పెద్దేవం గ్రామానికి చెందిన జీ. శంకర్ అనే యువకుడు దేవరపల్లి మండలం యాదవోలులో ఉన్న తమ సోదరీమణులకు రాఖీ కట్టించుకోవడానికి వెళు తున్నాడు.వీరిరువురు ఎదురెదురుగా వచ్చి ఒకరినొకరు బలంగా ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందగా సువర్ణ రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించగా వైద్యం పొందుతూ మృతి చెందారు.అయితే సువర్ణ రాజు మృతదేహానికి గోపాలపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించారు.అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన వాదాలకుంట తీసుకువెళ్లి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు.

# వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు,





అభివృద్ధి కార్యక్రమాలకు విరాళాలు అందించిన భక్తులు



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 10**:కోనసీమ తిరుమల వాడపల్లి స్వయంభు క్షేత్రంలో శ్రీ కలియుగ వెంకటేశ్వర స్వామి అలివేలు మంగా, పద్మావతి అమ్మవార్లకు ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. తెలుగురాష్ట్రాల నలుమూలల నుండి భక్తులు తరలివచ్చి స్వామివారి దివ్యదర్శనం పొందారు.

వేకువ జామున స్వామివారి మేలుకొలుపు సేవ, ఐశ్వర్య లక్ష్మీ హోమం, అలంకరణ ఉత్సవం, సుప్రభాత సేవలను ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏడు వారాల నోములు పూర్తిచేసుకున్న భక్తులు వసంత మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయ అభివృద్ధి కార్యక్రమాల కోసం భక్తులు ఉదారంగా విరాళాలు సమర్పించారు. నిడదవోలు మండలం, కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన బెల్లపుకొండ కృష్ణమూర్తి - గొడవర్తి వరలక్ష్మి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి 1,01,116 రూ,విరాళం అందించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి చెందిన దేవిశెట్టి నాగేశ్వరరావు %-% విజయలక్ష్మి దంపతులు 25,116 విరాళం ఇచ్చారు.వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉప కమిషనర్ ఎన్. ఎస్. చక్రధరరావు స్వామివారి చిత్రపటాలను బహుమతిగా అందజేశారు.

## ఉచిత విద్యుత్ పై నాయీ బ్రాహ్మణులు సంఘం హర్షం...



**కపిలేశ్వరపురం పెన్ పవర్ ఆగస్టు 10.**ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చి రాష్టం లో కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని జిల్లా నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెన్నేటి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. సెలూన్ షాప్ లకు 150 నుండి 200 వరకూ పెంచుతూ ఉచిత విద్యుత్ ఇస్తూ అందుకు తగ్గట్టుగా కేబినెట్లో ఆమోదించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు నాయీ బ్రాహ్మణుల సంఘం తరఫున వెన్నేటి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే మేనిఫెస్టో లో నాయీ బ్రాహ్మణల సర్వతోముఖాభివృద్ధి కోసం ఇచ్చిన మిగిలిన హామీలను ప్రాధాన్యత క్రమం లో నెరవేర్చి బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి గా నిలవాలని నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెన్నేటి నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు.

## దాత సహకారంతో అన్నదాన సత్రం నిర్మాణానికి శంకుస్థాపన.



-సంపర సుధాకర్ వినాయక వర్మ సేవలు అభినందనీయం.

కిర్లంపూడి మండలం చిల్లంగి, (శ్రీనివాసనగరంలో) వేంచేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక గల కాళీ స్థలంలో అన్నదాన సత్రం నిర్మాణానికి ఆదివారం ఎంతో అట్టహాసంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భోజనశాలకు సరియైన వసతి సౌకర్యం లేకుండాపోయింది. దీంతో చిల్లంగి గ్రామ వాస్తవ్యులు సంపర సుధాకర్ వినాయక వర్మ స్పందించి తన సొంత నిధులు వెచ్చించి భారీవ్యయంతో నిర్మించడానికి ముందుకు రావడమే కాకుండా ఆదివారం ఉదయం స్వయంగా సంపర సుధాకర్ వినాయక వర్మ దంపతులు చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో చిల్లంగి,కిర్లంపూడి, జగపతినగరం గ్రామాల నుండి పలువురు భక్తులు తోపాటు, మూడు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామివారి భక్తులు సహాయ సహకారాలతో ప్రతి శనివారం ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అన్నదాన కార్యక్రమానికి వచ్చే భక్తులకు సరియైన వసతి సౌకర్యం లేకపోవడంతో విషయాన్ని హైదరాబాదులో వ్యాపారరీత్యా స్థిరపడిన చిల్లంగి గ్రామానికి చెందిన సంపర సుధాకర్ వినాయక వర్మ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. తక్షణమే స్పందించిన సుధాకర్ వినాయక వర్మ సొంత గ్రామానికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని దృఢ సంకల్పంతో భోజనశాల నిర్మాణానికి ముందుకు రావడమే కాకుండా, కుటుంబ సమేతంగా హాజరై స్వయంగా భోజనశాలకు శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మూడు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



## కొబ్బరి చెట్టు నుంచి పడి వ్యక్తి మృతి



**ఆత్రేయపురం,పెన్ పవర్ ఆగస్టు 10**:ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామానికి చెందిన కారంకి వీర వెంకట సత్యనారాయణ (42) ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో మృతిచెందారు. వృత్తిరీత్యా గౌడ అయిన ఆయన రామిరెడ్డి వీరభద్ర అనే రైతు వద్ద కొబ్బరి దింపు పనికి వెళ్లారు.కొబ్బరికాయలు దింపుతుండగా ప్రమాదవశాత్తు పై నుండి జారి కిందపడటంతో తీవ్రగాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. మృతుడు వివాహితుడు, ఒక కుమారుడు ఉన్నాడు.

ఈ ఘటనపై మృతుడి తమ్ముడు కారంకి నాగరాజు ఫిర్యాదు చేయగా, ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# బెల్ట్ షాపులు తొలగించాలి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 10** :మద్యం తాగి వచ్చి భార్యలను కొట్టి హింసించి బ్రతుకులను నాశనం చేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఆదివారం పి రాజవరం గ్రామంలో మహిళలు ఆందోళన చేపట్టారు. గతంలో అతిగా మద్యం తాగడం వలన ఈ గ్రామంలో యువకుడు చనిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరలా ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి వచ్చి భార్యను కొట్టాగా ఆసుపత్రి పాలు అయిందని తెలిపారు .గ్రామంలో బెల్ట్ షాపులు వద్దు అని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఏ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని మహిళలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మా గ్రామంలో బెల్ట్ షాపులు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి రాజవరం సర్పంచ్ సోయంకాంతమ్మ, మహిళలు సోడం అరుణ, ఎం నాగమణి, తాడి సుధారాణి, కంగాల నాగమణి, తాడి రాణి, తాటి నాగదేవి, పే డపట్ల మునెమ్మ, పి మేరీ, కోరసా వెంకటలక్ష్మి, కడలి సూర్యకాంతం, తాడేపల్లి వసుంధర ,సోయం చెల్లమ్మ, పీతల నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా




**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 10 :**నల్లా చారిటబుల్ ట్రస్ట్ , శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ,రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11న జాబ్ మేళా నిర్వహించబడుతుందని నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్,ఫార్మసీ, మెకానికల్, ఎలక్ట్రికల్, డిప్లమో పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశం, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ద్వారా ఉచితంగా డిగ్రీ విద్య నిర్వహించబడుతుందన్నారు. ఇంటర్ ఎంపీసీ,బైపీసీ మరియు ఫార్మసీ టెక్నాలజీ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం ప్రముఖ ఔషధ సంస్థ ఎమ్మెఎస్ఎన్ లేబోరేటరీస్ హైదరాబాద్ లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడును అన్నారు. 2024 లేదా 2025 మొదటి ప్రయత్నంలోనే కనీసం 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. వారికి 2.3 లక్షలు వార్షికం తో ఉద్యోగ అవకాశం కల్పించబడును. 2024 లేదా 2025 లో మొదటి ప్రయత్నంలోనే ఎంఎస్సీ లేదా బీఎస్సీ పూర్తి ఎంఎస్సీ కనీసం 55% మార్కులతో పాస్ అయ్యి ఉండాలి వారికి 2.5 నుంచి 3.0 లక్షల వార్షిక ఆదాయంతో అవకాశం కల్పించబడిను అని తెలిపారు. కావున నిరుద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చప్టా వంతెన కాంట్రాక్టర్ కు కాసుల పంట





**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.10:**అన్నవరం చప్టా వంతెన సుమారు 70 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించిన చప్టా కాంట్రాక్టర్ కు కాసుల పంట పండింది.ఎప్పటి లాగే ప్రజలకు కష్టాలు మిగిల్చిందని, బి.జె.పి, పార్టీమండల అధ్యక్షులు ముత్యాల రాంబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం అన్నవరం వాగు చప్టా ను పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రెండువేల ఇరవై రెండు 2023 సంత్సరంలో సుమారు 70 లక్షల రూపాయలు ఖర్చుతో చప్టా నిర్మాణం చేసినా నాణ్యత లేకపోవడంతో కట్టిన రెండుసంత్స రాలకే కుప్పకూలిందని వారు తీవ్రంగా విమర్శలు చేశారు. రంపచోడవరం నియోజకవర్గ శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి,తెలుగు యువత నాయకులు భాస్కర్ తో చప్టా కూలిన ప్రాంతం నుండి పోన్ లో మాట్లాడి సమస్య వివరించామని జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని వివరించారు.50 గ్రామాలకు రాకపోకలు అంతరాయం కలుగుతుందని వారు చెప్పారు.అనారోగ్యం వచ్చినా ప్రభుత్వ వైద్యశాలకు,బ్యాంకు కు రావాలన్నా పోవాలనా ఈ రహదారి మార్గంద్వారా రావాలని, వారన్నా రు.ఈచప్టా పరిశీలించిన వారిలో,జన సేన పార్టీ మహిళా అధ్యక్షురాలు బాగుల ప్రమీల రాణి,కార్యదర్శి బాగుల అంజన్ రావు,కేచెల పోసి రెడ్డి,జన సేన పార్టీ సీనియర్ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాస్,కొత్తూరు శేషు,ముంజపు సాయిరాం,కన్నా రావు,శ్రీరామ్,నాగేంద్రబాబు, తేజ, బి.జె.పి,జిల్లా నాయకులు పాయం వెంకయ్య,యు రత్తయ్య,సొంది నాగేశ్వర్ రావు,కడుపు వెంకట రమణ, గూటాల రాంబాబు,సన్యాసి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రావిచెరువులో ఒకే కులానికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు.





**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 10:**
కె. గంగవరం మండలం రావిచెరువు గ్రామానికి గౌరవం తెచ్చే సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు, పంపన వెంకట రాంప్రసాద్ ఇద్దరూ ఒకే కులానికి చెందిన వారు పోలీస్ డిపార్ట్మెంట్‌లో కానిస్టేబుల్ హోదాకు ఎంపికయ్యారు. ఈ విజయంతో గ్రామంలో ఆనందం నెలకొంది. కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు వీరిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలి ఎంపీడీవో యం. భారతి

**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 10:**దేశ సమగ్రత కోసమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం చేపట్టి ఇంటింటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఎంపీడీవో యం. భారతి పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 15 పురస్కరించుకుని హర్ ఘర్ తింరగ్ సీతానగరం మండలంలోని మండల స్థాయి అధికారులతో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి సీతానగరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు,
ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత జాతి సమైక్యతను కాపాడుతూ భావి తరాలకు దేశభక్తి స్ఫూర్తిని నింపాలని ఆమె సూచించారు.ప్రతి ఇంటి పై జాతీయ జెండాను ఎగురవేసి దేశానికి అండగా నిలవాలనిపిలుపుని
చ్చారు. ప్రతి ఒకరు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడడంతో పాటు జాతీయ జెండాను గౌరవించాలన్నారు. స్వతంత్రం దినోత్సవం వేడుకలు వాడల వాడల ఘనంగా జరుపుకోవాలని అన్నారు,ర్యాలీలో ఎస్సై డి. రామ్ కూమార్, ట్రైనింగ్ ఎస్సై బి. సురేష్, తాసిల్దార్ అంకం శ్రీనివాస్, తదితర మండల అధికారులు పాల్గొన్నారు,



## 13 నుండి ప్రతి ఇంటిపై జెండా ఎగరవేయాలి -బిజెపి



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 10:** బీజేపీ నూతన పార్టీ కార్యాలయం లో జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా లో వున్న అన్ని మండలాల అధ్యక్షులకు, జిల్లా పార్టీ పదాధికారులకి,ఇంచార్జి లకు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జాతీయ బీజేపీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నల్లా పవన్ కి హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి జోనల్ ఇచార్జీ గా నియమింపబడినందుకు ఆయనకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ పార్టీ ఆదేశాలు మేరకు ఈ నెల 10 నుంచి 12 వరకు యువత మహిళలతో ప్రతి మండలంలో తిరంగా యాత్రలు నిర్వహించాలని, 12 నుంచి 14 వరకు స్వాతంత్ర పోరాట స్మారక చిహ్నాలు యుద్ధస్మారకాలను శుభ్రపరచి పూలతో నివాళులు చేయాలని, 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని, ఆగస్టు 14 న విభజన విభజిత స్మృతి దివస్, మౌన ర్యాలీలు, ఫోటో ప్రదర్శన, హాల్ మీటింగ్స్ పెట్టాలని సూచించారు. అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని మండలాల అధ్యక్షులు పైన తెలుపబడిన కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కొప్పనాతి దత్తాత్రేయ, చీకరమెల్లి శ్రీనివాసరావు, సలాది వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 12న స్వర్గీయ ఎన్టీ రామారావు నూతన విగ్రహావిష్కరణ.

### సినీ హీరో నారా రోహిత్, మంత్రి సుభాష్ చేతుల మీదుగా.



**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు10 :**
ఈ నెల 12న ఉదయం 10:30 గంటలకు సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి, తెలుగు వారి గుండెల్లో తనదైన ముద్ర వేసుకున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం రామచంద్రపురం లో జరుగుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సుమారు తొమ్మిది లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన నందమూరి తారక రామారావు గారి విగ్రహ ఆవిష్కరణకు యువ నాయకులు, ప్రముఖ సినీ హీరో నారా రోహిత్, మంత్రి సుభాష్ లు హాజరై వారి చేతుల మీదుగా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఈ మహోన్నత కార్యక్రమానికి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఈనెల 12న మంగళవారం ఉదయం 10:30 గంటలకు రామచంద్రపురం బైపాస్ సెంటర్ పసలపూడి వద్దకు తరలిరావాలని పిలుపునిచ్చారు. పేదలకు పింఛన్ సౌకర్యం, కిలో రెండు రూపాయలకే బియ్యం ప్రవేశపెట్టి, పాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి తెలుగు ప్రజల ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ రామచంద్రపురంలో మంత్రి సుభాష్ ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నామని ఒక ప్రకటనలో వెల్లడించారు. అదే రోజున ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ అనంతరం బైపాస్ రోడ్ లోని విజయ్ ఫంక్షన్ హాల్లో జరిగే "కోనసీమ యూత్ సమ్మిట్" లో ముఖ్య అతిథులు సినీ నటులు నారా రోహిత్, మంత్రి సుభాష్ లు పాల్గొంటారని వాసంశెట్టి సత్యం తెలిపారు.

## ఘనంగా యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం

- విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ పోరాటం.
- యుటిఎఫ్ నాయకులు సమారెడ్డి రాజు, సూర్యనారాయణ, ధర్మారావు, శ్రీనివాస మూర్తి, గోపి.






**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 10.**ముంచంగిపుట్టు మండల కేంద్రంలో యూటీఎఫ్ 52 వ ఆవిర్భావ దినోత్సవాన్ని యుటిఎఫ్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు సమరెడ్డి రాజు అధ్యక్షతన యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో పూర్వ ప్రధాన కార్యదర్శి యన్ సిద్ధేశ్వరరావు యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు సూర్య నారాయణ, పుండరీ, త్రినాధం, గోవింద్, రఘుమణి, శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ.. గత 51 సంవత్సరాలుగా విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ పాటుపడిందన్నారు. అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి ఉపాధ్యాయుల ఉన్నతికి ఎంతో కృషి చేసిందన్నారు. విద్యారంగం సంక్షోభంలోకి నెట్టి వేయబడిందని, పాలక వర్గం ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెంచి తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అసోసియేట్ అధ్యక్షులు చిట్టపులి త్రినాధం, కార్యవర్గ సభ్యులు అరిసెల గణపతి, ఏ వీరన్న, ధనుపతి, యమ్ గణేష్ కుమార్, పి లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి దృష్టికి దారెల పంచాయతీ సమస్యలు

- సమస్యలు పరిష్కరిస్తానన్నా సిఎం.
- దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 10.**
మండలంలో గల దారెల పంచాయితీ సమస్యలను పరిష్కారం కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం పాత్రికేయులతో మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని వంజంగిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దారెలా పంచాయతీ సమస్యలపై వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ.. దారెలా రోడ్డు నుండి పెదపేట వరకు 2 కిలోమీటర్లు రోడ్డు మంజూరు చేయాలని, కిలగాఢ నుండి గన్నేడా జంక్షన్ వరకు 1.5 కిమీ బి. టి రోడ్డు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని, దారెలా పంచాయతీలో గన్నేడా జంక్షన్ నుండి టొంగి కోట వనభాసింగి పంచాయతీ వరకు 2.5 కి. మీ క్రొత్త బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలనీ వినతి పత్రం సమర్పించామన్నారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కనీసం పంచాయతీ అభివృద్ధి కోసం పట్టించుకోలేదని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సహకరించాలని పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



కి వినతిపత్రం ఇచ్చి విజ్ఞప్తి చేశామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శానుకూలంగా స్పందించి దారెలా పంచాయతీ సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

## నేషనల్ డాగ్స్ షో గోడ పత్రిక ఆవిష్కరణ



**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 10:**విశాఖ కెన్నెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కెన్నెల్ క్లబ్ ఆఫ్ ఇండియా సహకారముతో సెప్టెంబర్ 14 న, గాదిరాజు ప్యాలెస్ లో జరుగు నేషనల్ డాగ్స్ షో గోడ పత్రిక ని క్లబ్ మెంబర్స్ ఆవిష్కరించారు. ఈ షో కి దేశం నలుమూలలనుంచి అనగా, ఊటి, కోడాయికెనాల్, ఆంధ్ర, తెలంగాణ, ఒరిస్సా, తమిళనాడు, కలకత్తా, జార?ండ్, చత్తీస్ ఘడ్ వంటి వివిధ ప్రదేశాలనుంచి 50 జాతులు, 300 శునకాలు పాల్గొంటాయని సెక్రటరీ శ్రీ కృష్ణ తెలిపారు.. ఈ కార్యక్రమంలో, నారాయణ రెడ్డి, రాజేశ్వర రావు, సిరట్ల శ్రీనివాస్, సూర్యప్రకాష్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, రాజేష్, రామ రాజు, అనిల్, విశాఖ సింగ్, క్రాంతి, గణేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

## ఎర్నాపల్లి రైతులకు 34 వేల మొక్కలు పంపిణీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 10**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని సంకాడ పంచాయతీ ఎర్నాపల్లి గ్రామంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సిబ్బంది మొక్కల పంపిణీ కార్యక్రమంన్నీ ఎర్నాపల్లి గ్రామంలో 49 కుటుంబాలకు ఒక రైతుకి 700ల మొక్కలు చొప్పున సిల్వర్, మహాగని, మలబార్వేప మొక్కలను ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రైతులకు పంపిణీ కార్యక్రమం ఏర్నాపల్లి గ్రామంలో నిర్వహించగా రైతులు మాట్లాడుతూ మొక్కలు సరే కానీ ప్రభుత్వం వారు సబ్సిడీ రూపంతో మిస్ కంచె నిర్మాణానికి ఆలోచన చేయాలని కూటమి నాయకులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దోంబూరు చిట్టిబాబు,ఊలం ఈశ్వర్,మామిడి నాగేంద్ర, దేషగిరి గోవిందరావు,దేశగిరి గంగరాజు,మోట్టడం రాజారావు,వైస్ ఎంపీపీ దేముడు,వీఆర్పీలు విష్ణుమూర్తి,లోత బాలరాజు,మేట్ వెంకట్రావు, దొరబాబు,ఎర్నాపల్లి గ్రామస్తులు కోటేశ్వరరావు, అప్పారావు,రాజారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లంబసింగి ఘాట్ రోడ్డులో రహదారి పై కూలిన వృక్షం.



ప్రయాణికుల చొరవతో రహదారి పై నుంచి తొలగించబడ్డ వృక్షం



**చింతపల్లి పెన్ పవర్ 10 :-** చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారిలోని లంబసింగి ఘాట్ రోడ్డులో రహదారి పై చెట్టు కూలింది. నిత్యం చింతపల్లి నుంచి నర్సీపట్నం మీదుగా విశాఖపట్నం, విశాఖపట్నం నుంచి నర్సీపట్నం మీదుగా చింతపల్లి, జి కే వీది మండలాలలో వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ సహా ఇతర వాహనాలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. దీంతో వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణికులు సాహసించి ఆ భారీ వృక్షాన్ని తొలగించే కార్యక్రమానికి పూనుకోవడంతో ఎట్టకేలకు వాహనాల రాకపోకలకు అవరోధం తప్పింది. చెట్టు కూలిన సమయంలో ఆ మార్గంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు, వాహనదారులు వ్యక్తం చేశారు. ప్రయాణికులు వాహనదారులు ఒకరికొకరు సహకరించుకోవడం వలన వృక్షాన్ని తొలగించే కార్యక్రమం సునాయాసంగా జరిగింది.

# బాబు షూరిటీ. మోసం గ్యారెంటీ...



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగష్టు 10:** వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలచే స్థానిక వైసిపి కార్యాలయం నందు బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగింది. వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎక్స్ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అరకు పార్లమెంట్ ఎంపీ తనుజారాణి, అరకు పార్లమెంట్ వైఎస్ఆర్సిపి పరిశీలకులు బొడ్డేటి ప్రసాద్, రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు ఎక్స్ ఎమ్మెల్యే రాజానగరం జక్కంపూడి రాజా ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎంతమంది ముఖ్యమంత్రులు పరిపాలించి నప్పటికీ ఏ ఒక్కరూ కూడా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని, కానీ ఎన్నికల హామీలన్నీ పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఘనత ఒక్క జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. కావున ప్రజలకు వాస్తవాలను తెలియజేసి కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ పదకొండు మండలాల వైసిపి ఎంపీపీలు,జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు ,మండల ప్రెసిడెంట్లు,నాయకులు కార్యకర్తలు, వైఎస్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.




# దేగలపేట న్యూ సీయోను చర్చ్‌ను సందర్శించిన జనసేన నాయకుడు డాక్టర్ దేగల నాగేంద్ర



**కాజులూరు, ఆగస్టు 10 పెన్ పవర్**
మండల పరిధిలోని దేగలపేట గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న న్యూ సీయోను బాప్టిస్టు చర్చ్‌ను ఆదివారం మధ్యాహ్నం జనసేన యువనాయకుడు డాక్టర్ దేగల నాగేంద్ర సందర్శించి దైవ దీవెనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎం. మేరీ సుష్మ ప్రార్థన చేసి నాగేంద్రను ఆశీర్వదించారు. చర్చ్ నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని సంఘస్తులు వివరించగా, డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సహాయం అందించడం తన వంతు కర్తవ్యమని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అడుగుజాడల్లో నడుస్తూ, పవన్ కళ్యాణ్ మార్గదర్శిగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. చర్చ్ నిర్మాణాన్ని పూర్తిచేయడానికి తన వంతు సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. తరువాత బందనపూడి గ్రామంలో బొంతు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి, ఆయన సతీమణికి రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. అలాగే పులగల సాయి కుటుంబానికి కూడా రూ.10,000 సాయం చేశారు. తన ఆర్థిక సాయం పలువురికి మేలు చేకూరాలని ఆశిస్తున్నానని తెలిపారు. గ్రామంలోని సంఘ కాపరులు, జనసేన నాయకులు నాగేంద్ర సేవాభావాన్ని ప్రశంసించారు. ఆయనలాంటి యువనాయకులు రాజకీయాల్లో రావాలని ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఫ్లెక్సీలు పెట్టి, భాణ సంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు.



# వైభవంగా శ్రీ స్వామివారి స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం





**సింహాచలం, పెన్ పవర్, ఆగస్టు 10** : నమో నరసింహ దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీనృసింహస్వామివారి దేవస్థానంలో వైభవంగా శ్రీ స్వామివారి స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వైదిక సిబ్బంది ఆలయ అధికారులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తముగా శ్రీ స్వామివారికి 108 బంగారు పుష్పాలతో అత్యంత వైభవంగా స్వర్ణ పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్ణపుష్పార్చన అత్యంత వైభవంగా జరిగింది. సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధిష్టింప జేసి, వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి స్వర్ణ పుష్పార్చన సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

## అంబాజీపేట సొసైటీ అధ్యక్షుడుగా అరిగెల



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 10:**అంబాజీపేట సొసైటీ అధ్యక్షునిగా మాచవరం గ్రామానికి చెందిన సినీయర్ జనసేన నాయకులు అరిగెల సూరిబాబును నియమిస్తూ కూటమి ప్రభుత్వం ప్రకటన విడుదల చెసింది. కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషిచేసి ప్రత ఒక్కరిని అధిష్టానం గుర్తించి అవకాశం కల్పిస్తుందని సూరిబాబు అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడుగా నియమించుటలో పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తల అందరితో మమేకమై పార్టీ అభివృద్ధికి కృషి చేసి గ్రామ స్థాయిలో బలోపేతం చేస్తానని అన్నారు. దీంతో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్త లు అరిగెల సూరిబాబు అభినందనలు తెలిపారు.

# అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, ఆగస్టు 10** : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామివారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.



## రాష్ట్ర ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు పర్యటనతో కోట్లాది ప్రజాధనం దుర్వినియోగం

- పాడేరు శాసనసభ్యులు
- విశ్వేశ్వర రాజు ఆరోపణ



**పాడేరు పెన్ పవర్ ఆగస్టు 10:**..ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పాడేరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిరిజనులకు చేసింది, ప్రకటించింది శూన్యమని, ఆయన పర్యటనతో కోట్లాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అయిందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన పాడేరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఓ ప్రకటన విడుదల చేశారు.

బాబు మీ మోసపూరిత మాట్లను ఇంకా కట్టి పెట్టండి మీకు ఆదివాసి లపైన శ్రద్ధ ఉంటే ఇప్పటికే మీరు జీవో నెంబర్ 3కి బదులుగా మరో జీవో తెచ్చేవారు కానీ మీరు అధికారంలోకి వచ్చే సుమారు పదమూడు నెలలు పూర్తి అయిన ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కూడా ఏమి చేయాలో ఆలోచన చేస్తున్నానని అని చెప్పడం చూస్తే మా ఆదివాసీల మీద మీకు ఉన్నశ్రద్ధ ఏమిటో అర్థమవుతుంది. మీరు అధికారంలోకి వచ్చినా తర్వాత ఇచ్చిన మెగా డిఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖలో సుమారు 3000 పోస్టులను మెగా డీఎస్సీలో కలిపి మా ఆదివాసీలకు అన్యాయం చేయలేదా ?మీకు అంత ఆదివాసీల మీద మీకు అంత ప్రేమ ఉంటే డీఎస్సీలో ఆదివాసీలకు 100% రిజర్వేషన్ తో రావలసిన ఉద్యోగలను ఆపి ఆదివాసీ లకు 100% రిజర్వేషన్ ఇచ్చిన తర్వాత నియామకం చేయవచ్చు కదా ఎందుకు మీరు ఆ పన్ని చేయలేదుదీనికి మీరు సమాధానం చెప్పాలి ?జీవో నెంబర్ 3 మా ప్రభుత్వ అధికారులు ఉన్నప్పుడు సుప్రీంకోర్టులో ఆదివాసీలకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం జరిగింది. ఇది అందరికీ తెలిసిందే అయితే అప్పుడే మా గౌరవం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు సంబంధిత అధికారులతో మాట్లాడి ఆదివాసీలకు సంబంధించి వారి న్యాయం చేయడం కోసం అని ఏర్పాట్లు చేసి సరైన విధంగా పరిష్కారం చూపమని న్యాయస్థానంలో ఏ విధంగా చేస్తే ఆదివాసిలకు న్యాయం జరుగుతుందొ ఆ విధంగా చర్యలు తీసుకోమని ఆదేశించారని ఆదేశించారు.రాజ్యంగా ప్రకారం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ లో ఆనాడు ఆదివాసీలకు ఉద్యోగ నియామకాలు 100% రిజర్వేషన్ ఇవ్వాలి అని తీర్మానం చేశారు అది మీరు తెలుసుకుంటే మంచిది.మీరు సుమారు 14 సంవత్సరముల ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఏనాడు పాడేరు లాంటి మారుమూల గిరిజన ప్రాంతంలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆదివాసీలకు ఆరోగ్య సమస్యలు పరిష్కరించాలనేటు వంటి ఆలోచన కూడా చేయకుండా పరిపాలన సాగించారు.మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు ఆదివాసులకు ఆరోగ్యం అందుబాటులో తేవాలని ఒక మంచి సంకల్పంతో మెడికల్ కళాశాల ఏర్పాటుచేశారు.అది ఏదో మీరొచ్చి మీరు ఇచ్చినట్టుగా చెప్పడం చూస్తే ఇది చాలా విడ్డూరంగా ఉంది ఆదివాసీలకు పరిపాలన కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలను పూర్తిగా ప్రాజెక్టు అధికారులుగా ఐఏఎస్ నియమిస్తున్నామని చెప్తున్నారు మీరు. అసలు పాడేరు ఐటీడీఏ గత 6 నెలలుగా పర్మినెంట్ పిఓ నే వేయకుండా ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ అధికారితో నడిపిస్తున్నారు అదే విధంగా విద్యాశాఖలో డిప్యూటీ డైరెక్టర్ పోస్ట్ గత 9 నెలలకు ఎవరిని నియమించకుండా ఇన్ ఛార్జ్ తో పాలన సాగిస్తు ఐటిడిఏ లో పాలనను మీ ప్రభుత్వం గాలికి వదిలేసింది.అసలు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఏ రోజు ఐటిడిఏ కి వచ్చి అధికారులతో సమీక్ష సమావేశం కూడా చేయకుండా చట్టం చూపుకి వచ్చి వెళ్తున్నారు.ఇటీవల అవినీతి నిర్మూలన అధికారులకు లంచం తీసుకుంటు దొరికిన గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం చీఫ్ కి అతను ఈ నెలలో రిటైర్ అవుతున్న అతన్నీ మరో కొద్దికాలం పాటు ఆ పదవిలో కొనసాగుటకు అనుమతులు ఇద్దామని ప్రయత్నం చేసింది ఎవరో కూడా మీరు మీ మంత్రి సమాధానం చెప్పాలి?ఆదివాసులు చట్టాలను గౌరవిస్తానని చెబుతున్న మీరు గిరిజన ప్రాంతంలో పీసా కమిటీల తీర్మానాలు కూడా లేకుండా మీరు కార్పొరేట్ కంపెనీలకు వారి ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారని ఇది నిజం కాదా ఇదేనా ఆదివాసీలపై మీకున్నటువంటి ప్రేమ!

మొత్తం మీద రాష్ట్ర ముఖ్యమంత్రి ఏజెన్సీ పర్యటన స్థానిక ఆదివాసులను పూర్తిగా నిరాశపరిచిందని ఆయన పర్యటన వల్ల గిరిజనకు ఒరిగింది ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

# భక్తుల సౌకర్యార్ధం టెన్సిల్ మెంబ్రేన్ స్ట్రక్చర్ నిర్మాణానికి భూమి పూజ







**సింహాచలం, పెన్ పవర్, ఆగస్టు 10** : శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో భక్తుల సౌకర్యార్థం రూ.3 కోట్ల వ్యయంతో టెన్సిల్ మెంబ్రేన్ స్ట్రక్చర్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. సింహాచలం దేవస్థానంలో శ్రీ స్వామి వారి దేవస్థానంలో భక్తుల సౌకర్యం కోసం ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా టెన్సిల్ మెంబ్రేన్ స్ట్రక్చర్ నిర్మాణానికి ఆదివారం ఉదయం 7.30 గంటలకు భూమి పూజ నిర్వహించారు. ఈ నిర్మాణానికి విజయవాడకు చెందిన డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి, శ్రీ వైభవి ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తిమ్మరసు వీధి, శ్రీనగర్ కాలనీ వారు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, దాత కుటుంబ సభ్యులు, ఆలయ అధికారుల సమక్షంలో సాంప్రదాయ బద్ధంగా భూమి పూజ నిర్వహించబడింది. టెన్సిల్ మెంబ్రేన్ స్ట్రక్చర్ 30 మీటర్ల పొడవు, 60 మీటర్ల వెడల్పు కలిగి ఉంటుంది. దీని ద్వారా ఎండ, వానల నుండి భక్తులు రక్షణ పొందే అవకాశం ఉంది. వేసవిలో, వర్షాకాలంలో సింహాచలం వచ్చే భక్తులకు విశ్రాంతి తీసుకునేందుకు, వేచి ఉండేందుకు మెరుగైన సౌకర్యాలు కలుగుతాయని ఆలయ ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిఎస్ రామరాజు, ఇంజనీరింగ్ సిబ్బంది ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్ టైం లక్ అంటే వీరిద్దరిదే.. కోహ్లీ, డివిలియర్స్‌తో ఫోన్ మాట్లాడిన కిరాణా కొట్టు కుర్రాళ్ళు



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెటర్లను గ్రౌండ్ లో చూడడం ఫ్యాన్స్ కు ఒక కల. వారిని కలిస్తే అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. ఇక వారితో ఫోటోలు తీసుకుంటే జన్మ ధన్యమైనదని భావిస్తారు. ఇదంతా పక్కన పెడితే ఎవరో ఒక సాధారణ వ్యక్తి ఏకంగా కోహ్లీ, డివిలియర్స్ లాంటి స్టార్ క్రికెటర్లతో ఫోన్ లో మాట్లాడితే ఆ అనుభవం ఎలా ఉంటుంది. అలాంటి అదృష్టం 21 ఏళ్ళ యువకుడికి కలిగింది. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లా దేవ్‌భోగ్‌లో ఈ ఊహించని సంఘటన సంచలనంగా మారుతోంది. అసలేం జరిగిందో.. పూర్తి వివరాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.. జూన్ 28న అంటే 12 రోజుల క్రితం మనీష్ అనే 21 ఏళ్ళ కుర్రాడు కిరాణా షాప్ తో తన జీవితం కొనసాగిస్తున్నాడు. అతనికి దగ్గరలో ఉన్న ఒక మొబైల్ షాప్ లో కొత్త రిలయన్స్ జియో సిమ్ తీసుకున్నాడు. సిమ్ యాక్టివేట్ చేసిన తర్వాత వాట్సాప్ క్రియేట్ చేయగానే బిగ్ షాక్. వాట్సాప్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ ప్రొఫైల్ పిక్చర్ కనిపించింది. ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోకున్న వారికి కాసేపటికే ఊహించని సీన్ ఎదురైంది. విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ నుంచి ఆ కుర్రాడికి కాల్స్ వచ్చాయి. పాటిదార్ పాత మొబైల్ నంబర్ 90 రోజుల పాటు ఇన్ ఆక్టివ్ లో ఉంది. దీంతో టెలికాం ప్రొవైడర్ ఈ సిమ్ ను డీ ఆక్టివ్ చేసిన తర్వాత మనీష్ అనే కుర్రాడు ఆ సిమ్ ను కొనుగోలు చేశాడు. సహజంగా ఎవరైనా కోహ్లీ, డివిలియర్స్ ఫోన్ అంటే ఎవరైనా అబద్ధం అనుకుంటారు. మనీష్ అతని ఫ్రెండ్ ఖేమ్ రాజ్ కూడా అంతే అనుకున్నాడు. ఎవరో తన ఫ్రెండ్స్ ప్రాంక్ చేసి తనని ఆటపట్టిస్తున్నారని లైట్ తీసుకున్నాడు. అలా కాల్స్ వచ్చినప్పుడల్లా మనీష్.. తనకు తాను మహేంద్ర సింగ్ ధోనీ" అని పరిచయం చేసుకుని బిగ్ ట్విస్ట్ ఇచ్చాడు. జూలై 15న మనీష్‌కు ఏకంగా రజత్ పటిదార్ నుంచి కాల్ వచ్చింది. నంబర్ తనదే అని దయచేసి దాన్ని తిరిగి ఇచ్చేయండి అని చెప్పాడు. అది కూడా అబద్ధం అని భావించిన మనీష్ జోక్ అనుకుని తాను ధోనీ అని సంధానమిచ్చాడు. దీంతో పోలీసులను పంపుతాను అంటూ పాటిదార్ హెచ్చరించాడు. కొంత సమయం తర్వాత పోలీసులు మనీష్ ఇంటికి చేరుకోవడంతో నిజంగానే పాటిదార్‌తో తాము మాట్లాడుతున్నామని వారికి అర్థమైంది. వెంటనే ఇద్దరూ సిమ్‌ను తిరిగి ఇచ్చారు. జరిగిన విషయం తెలుసుకుని విరాట్ కోహ్లీ ఫ్యాన్స్ అయిన మనీష్, ఖేమ్‌రాజ్‌కు ఎగిరి గంతేశారు. అనుకోకుండా వచ్చిన ఈ కాల్స్ అతని జీవితంలో అత్యంత గుర్తుండిపోయే క్షణాలు అని సంబరపడ్డారు. కోహ్లీతో మాట్లాడినంధుకు జీవిత లక్ష్యం నెరవేరింది అంటూ మరిసిపోయారు.

# సోయగాలతో మెస్మరైజ్ చేస్తున్న.. కోరిటికల్ జలపాతం..సందర్శకుల రద్దీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో ప్రముఖ కోరిటికల్ జలపాతం మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. పర్వతాల మధ్య నుంచి ఉప్పొంగి పడుతున్న జలపాతం అపూర్వ సోయగాన్ని సంతరించుకుని పర్యాటకులను ఆకర్షిస్తోంది. పచ్చని అరణ్యాలు, పర్వతాల నడుమ సుడిగుండంలా కిందకు దూసుకుపోతున్న జలప్రవాహం చూసి సందర్శకులు మురిసిపోతున్నారు.

**పర్యాటకుల రద్దీ**

వీకెండ్ కావడంతో పాటు వర్షాకాలం అందాలను ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జలపాతం చుట్టుపక్కల ఫోటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందర్శకులు ముచ్చటపడుతున్నారు. ఫ్యామిలీలు, యువత, పిల్లలు కలిసి ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తూ సందడి చేస్తున్నారు.

**ప్రకృతి అందాలు అదుర్స్..**

గత కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కోరిటికల్ జలపాతంలో నీటి ప్రవాహం గణనీయంగా పెరిగింది. దీని వల్ల జలపాతం పూర్తిస్థాయిలో కాస్కేడ్లలా కిందకు వర్షం కురిసినట్టుగా పడుతూ కనులవిందు చేస్తోంది. పర్యాటకుల రాకతో అక్కడి వ్యాపారులు, టీ దుకాణాలు, వాహన పార్కింగ్ కేంద్రాలు సందడిగా మారాయి.

# రోడ్డు లేక గర్భిణీ నరకయాతన..మార్గమధ్యలో ప్రసవం.. వీపుపై మోసుకెళ్లిన కుటుంబ సభ్యులు




**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లాలో రోడ్లు లేక గర్భిణీ నరకయాతన.. నాగల్‌గిద్ద మండలంలోని మున్యా నాయక్ తండా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఓ గర్భిణీ చెప్పలేని బాధ అనుభవించింది. ఆదివారం ఉదయం ప్రసవ వేదన మొదలైన ఆ మహిళను కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే తండాకు వెళ్లే రహదారి లేకపోవడంతో అంబులెన్స్ గ్రామానికి చేరుకోలేకపోయింది. పరిస్థితి అత్యవసరంగా ఉండటంతో కుటుంబ సభ్యులు, ఆశా కార్యకర్తల సహాయంతో సుమారు 2 కిలోమీటర్ల దూరం వరకు ఆ బాలింతను వీపుపై మోసుకెళ్లారు.దారిలోనే ప్రసవం జరగడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. సుమారు గంటపాటు తీవ్ర వేదనను అనుభవించిన ఆ మహిళను చివరికి అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గ్రామస్తుల ఆవేదన

గత కొన్నేళ్లుగా తండాకు రోడ్డు వేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను గ్రామస్తులు పలు సార్లు కోరినా ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ హైకమాండుకు తలొగ్గిన కొండా? నాటి వ్యాఖ్యలపై రెండోసారి వివరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి వెనక్కి తగ్గారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఘాటు వ్యాఖ్యలు చేసిన కొండా పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు మరోసారి వివరణ ఇచ్చారు. రెండు నెలల క్రితం పార్టీ అగ్రనేత రాహుల్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యేలను అవమానించేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన తీరును నిరసిస్తూ ఎమ్మెల్యే నాయిని రాజేంద్రరెడ్డి నివాసంలో నలుగురు ఎమ్మెల్యేలతోపాటు మరికొందరు సీనియర్ నేతలు సమావేశమై, అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే ఓ సారి క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన కొండా, తాజాగా రెండో సారి వివరణ ఇచ్చుకున్నారు.

**హైకమాండ్ అసంతృప్తి?**

గతంలో గాంధీభవన్ లో నిర్వహించిన విచారణకు హాజరైన కొండా మురళి.. తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోగా, పార్టీ ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఆయన వివరణపై పార్టీ హైకమాండ్ సంతృప్తి చెందలేదని అంటున్నారు. దీంతో ఆదివారం మరోసారి విచారణకు హాజరుకావాల్సిందిగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి నోటీసులిచ్చింది. అంతేకాకుండా లిఖితపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది.

**ఖితపూర్వక వివరణ**

తన వివరణపై హైకమాండ్ సంతృప్తి చెందకపోవడంతో మాజీ ఎమ్మెల్సీ కొండా కాస్త వెనక్కి తగ్గారని అంటున్నారు. పార్టీ ఆదేశాల మేరకు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, ఆయన సతీమణి మంత్రి కొండా సురేఖ తీరుతో కాంగ్రెస్ అధిష్టానం తల పట్టుకుంటుందని అంటున్నారు. ఈ ఇద్దరూ పార్టీలో మిగిలిన వారిని కలుపుకుని వెళ్లకపోవడం వల్ల రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పార్టీ హైకమాండ్ భావిస్తోంది.

**కాంగ్రెస్ పెద్దల టెన్షన్**

స్థానిక ఎన్నికల ముందు పార్టీలో ఈ పరిస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పెద్దలు.. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించాలని భావిస్తున్నారని అంటున్నారు. అందుకే ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్లను సంతృప్తిపరిచేందుకు కొండాను రెండోసారి విచారణకు పిలిపించినట్లు చెబుతున్నారు.

ఈ పరిణామంతో ఎమ్మెల్యేలు కొంత శాంతించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. మరోవైపు కొండా కూడా పరిస్థితి గమనించి వివాదానికి ముగింపు పలకాలనే ఆలోచనకు వచ్చినట్లు చెబుతున్నారు. గత విచారణ సమయంలో తగ్గేదేలే అన్న ప్రకటన చేసిన ఆయన ఇప్పుడు కాస్త కూల్ గా ఉన్నారని అంటున్నారు.

# బాబు డ్రీం ప్రాజెక్ట్...టార్గెట్ చేసిన అనుకూల మీడియా



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపుడూ వినూత్నంగా ఆలోచిస్తూంటారు. ఆయన రొటీన్ కి భిన్నంగా కొన్ని విషయాల్లో వ్యవహరిస్తారు. ఆయన ప్లాన్స్ అన్నీ భారీ కాన్వాస్ తో పరచుకుని ఉంటాయి. అలా తన ప్లాన్స్ ని అన్నింటినీ సంపూర్ణంగా చేయాలన్న సంకల్పం సైతం ఆయనకు ఉంటుంది. అయితే బాబు ఎంచుకున్న మార్గం సుగమం కాదు అది ఒకింత దుర్లభం దుర్గమం. అయినా ఆయన చాలెంజ్ గా తీసుకుంటారు. కాదు జరగదు అన్నది ఆయన థియరీలో లేదు, అందరి చేతా అవును అనిపిస్తారు.

చంద్రబాబు అనేక విషయాల్లో సక్సెస్ అయ్యారు. కొన్ని విషయాల్లో విమర్శలూ ఎదుర్కొన్నారు. ఇదిలా ఉంటే ఏపీకి నాలుగవ సారి సీఎం అయిన చంద్రబాబు మదిలో ఎన్నో ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో అమరావతి రాజధాని ఒకటి. అయితే దానితో పాటుగా ఆయన మానసపుత్రికగా మరో ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్ట్ బాబుకు నిజంగా ఎంతో ఇష్టమైనది సంతృప్తిని ఇచ్చేది అని చెప్పుకుంటారు. అలాంటి బాబు డ్రీం ప్రాజెక్ట్ మీద అనుకూల మీడియావే గట్టిగా టార్గెట్ చేస్తూ హాట్ హాట్ గా కామెంట్స్ చేసింది. ఇంతకీ ఏమా ప్రాజెక్ట్, ఏమా కథ అంటే మ్యాటర్ చాలానే ఉంది మరి.

**పీ 4 మీద విమర్శలు :**

చంద్రబాబు పీ 4 ప్రాజెక్ట్ ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఏపీలో పేదరికం అన్నది లేకుండా చేయాలన్నదే ఆయన ఆలోచన. ఏపీలో అత్యంత పేదరికం తో సతమతమవుతున్న వారు ఇరవై శాతం గా ఉన్నారు. వారిని బాగా ధనవంతులుగా ఉన్న పది శాతం మందికి ఎటాచ్ చేసి వారికి అండగా నిలిచేలా చేసేదే ఈ పీ 4 ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వం ఒక వేదికగా ఉంటుంది. అంటే ధనవంతులను పేదలను కలిపి అంతరం తగ్గించడం. పేదరికం పూర్తిగా లేకుండా చేయడం. ఇది చెప్పడానికి మంచి ప్రాజెక్ట్ కానీ ఆచరణలో ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయి. అందుకే ఈ ప్రాజెక్ట్ మీద ఏపీలో ప్రముఖ మీడియా సంస్థ విశ్లేషిస్తూ బాబు నీద ఘాటు వ్యాఖ్యలు చేసింది.

**అయ్యో పనేనా అంటూ :**

ఈ భూమి మీద ఎపుడూ అంతరం ఉంది అన్నది ఒక సిద్ధాంతం. పేదలు లేని సమాజం లేదు అన్నది మరో ఫీలాసఫీ. ఈ రెండూ నిజమే. అందుకే పేదరికం ఎక్కడకి వెళ్ళినా కనిపిస్తుంది. అభివృద్ధి ఎంతో చెందామని చెప్పుకునే దేశాలలో సైతం పేదరికం రెక్కలు విప్పుకుని చాలా చోట్ల దర్శనం ఇస్తుంది. ఎవరైనా చేసే పని పేదరికాన్ని వీలైనంత వరకూ తగ్గించే ప్రయత్నం చేయడమే కానీ పేదరికం అన్నది లేకుండా చేయడం ఎవరి వల్లా కానే కాదు అన్నది అంతా చెబుతున్న మాట. దానినే పట్టుకుని సదరు టీడీపీ అనుకూల మీడియా బాబు తీరుని తప్పుపడుతోంది. బాబు ఎందుకు ఈ తరహా ప్రాజెక్టుని ఎంచుకున్నారో అర్థం కావడం లేదు అంటూ కామెంట్స్ చేసింది.

**వారి వల్లనే ఇదంతా అంటూ :**

బాబు ఎపుడు సీఎం అయినా ఆయన పక్కన కొంతమంది చేరుతారు అని వారు ఇచ్చే సలహా సూచనల వల్లనే ఈ తరహా ఆలోచనలు వస్తూంటాయని కూడా సదరు మీడియా దుయ్యబెట్టింది. బాబు సైతం తన శ్రమను ఆలోచనలను సమయాన్ని అంతా ఈ తరహా వాటి మీద ఎక్కువగా పెడుతూ విలువైన కాలాన్ని అలా ఉపయోగిస్తున్నారు అని చెణుకులు వేసింది. 2029 నాటికి ఏపీలో పేదరికం లేకుండా చేస్తామని బాబు చెబుతున్న మాటలను కూడా సదరు మీడియా తమ విశ్లేషణలలో గట్టిగా తప్పుపట్టింది. బాబు అధికారంలోకి వచ్చిన ప్రతీసారీ ఈ కొత్త రకం ఆలోచనల వెంట పడడం వృధా ప్రయాస పడడం మామూలు అయిపోయింది అని కూడా విమర్శిస్తోంది.

**అచరణ సాధ్యం కానిది :**

పీ 4 పథకం ఆచరణ సాధ్యం కాదని కూడా సదరు మీడియా కుండబద్దలు కొడుతోంది. అంతే కాదు అది ఏ విధంగానూ ఉపయోగం లేనిది అని అంటోంది. కనీస ఆలోచనలు చేయకుండా బలవంతంగా మార్గదర్శులకు బాధ్యతలు ఇస్తున్నారని అంటున్నారు. చంద్రబాబుతో వచ్చిన తంటా ఏమిటి అంటే ఆయన ఏది పట్టుకుంటే దాని వెంట పడతారు. అలవిమాలిన ఆలోచనలను ఆయన ఇష్టపడుతూంటారు అని విమర్శించింది. పేదలను ధనవంతులు దత్తత తీసుకోవాలని ఈ ప్రాజెక్ట్ ద్వారా కోరుతున్నారు. ఇవన్నీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ఆలోచనలు అని కూడా నిప్పులు చెరిగింది. మొత్తానికి బాబు నేల విడిచి సాము చేస్తున్నారు అని తేల్చేసింది. మరి బాబుకు ఎంతో ప్రీతిపాత్రమైన పీ 4 ప్రాజెక్ట్ మీద ఒక అనుకూల మీడియావే ఈ విధంగా ధాటీగా విమర్శించడం మీద టీడీపీ ఏ విధంగా రియాక్ట్ అవుతుందో చూడాల్సి ఉంటుంది.

# 'ఆడుదాం-ఆంధ్ర' రిపోర్టు రెడీ.. రోజా వంతు వచ్చేసిందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నేతల అరెస్టుల పరంపరలో మరో మాజీ మంత్రి వంతు వచ్చిందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ఫైర్ బ్రాండ్, ఆ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా అరెస్టుకు రంగం సిద్ధమవుతోందని అంటున్నారు. 'ఆడుదాం-ఆంధ్ర' స్కాంలో రోజాను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం ఆధారంగా తెలుస్తోంది. శాప్ చైర్మన్ రవినాయుడు ఫిర్యాదు మేరకు 'ఆడుదాం-ఆంధ్ర' స్కాంపై విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారని చెబుతున్నారు. నిధుల దుర్వినియోగాన్ని నిర్ధారించడంతో కేసు నమోదుకు ప్రభుత్వం ఆదేశించే అవకాశం ఉందని అంటున్నారు.

**రూ. వంద కోట్ల అవినీతి?**

గత ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట సుమారు రూ.119 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో దాదాపు రూ.100 కోట్ల మేర అవినీతి జరిగిందని ఫిర్యాదులు వచ్చాయి. విజయవాడకు చెందిన ఓ ప్రైవేటు వ్యక్తితోపాటు శాప్ చైర్మన్ రవినాయుడు కూడా ఇదే ఆరోపణలు చేయడంతో ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. విచారణకు ఆదేశించింది. దీనిపై విజిలెన్స్ అధికారులకు బాధ్యతలు అప్పగించడంతో వారు సుదీర్ఘ విచారణ జరిపి అవకతవకలు నిజమేనంటూ నివేదిక రెడీ చేసినట్లు చెబుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ నివేదిక డీజీపీ ద్వారా ప్రభుత్వానికి అందివ్వనున్నారని అంటున్నారు.

**45 రోజుల్లోనే కోట్ల ఖర్చు**

క్రీడా పోటీలకు సంబంధించి పరికరాల కొనుగోలు, ముగింపు ఉత్సవాల పేరిట భారీగా అవినీతి చేశారని విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అప్పటి క్రీడా మంత్రిగా పనిచేసిన వైసీపీ ఫైర్ బ్రాండ్ రోజాపై అభియోగాలు మోపే అవకాశం ఉందంటున్నారు. కేవలం 45 రోజుల్లోనే రూ.119 కోట్లు ఖర్చు చేయడంపై ప్రభుత్వం, టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఈ కుంభకోణంలో సుమారు 400 కోట్ల కుంభకోణం జరిగిందని కూడా ఆరోపిస్తున్నారు. అయితే రూ.119 కోట్లు కేటాయిస్తే రూ.400 కోట్లు అవినీతి ఎలా జరిగిందని వైసీపీ ప్రశ్నిస్తోంది. దీనికి సమాధానంగా జిల్లా క్రీడా సంఘాల నుంచి ఖర్చుచేసిన మొత్తం కూడా ఈ స్కాం కిందకే వస్తుందని టీడీపీ చెబుతోంది. దీంతో విజిలెన్స్ నివేదికలో ఎంత మొత్తం అవినీతిని గుర్తించారనేది కూడా ఉత్కంఠ రేపుతోంది.

**రోజాకు బిగిస్తున్న ఉచ్చు**

మొత్తానికి మాజీ మంత్రి ఆర్కే రోజాకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి పలు కేసుల్లో రోజాను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరిగింది. ప్రధానంగా ఆమెపై అనుచిత వ్యాఖ్యల కేసులను నమోదు చేస్తారని అనుమానాలు వ్యక్తమయ్యాయి. టీటీడీ దర్శనాల విషయంలోనూ రోజాపై విమర్శలు ఉండటంతో ఆ దిశగాను చర్యలు తీసుకోవచ్చని అనుకున్నారు. కానీ, అవినీతి వ్యవహారంలోనే ఆమెను అరెస్టు చేస్తారని ఎక్కువగా నమ్ముతున్నారు. దీంతో ఆడుదాం-ఆంధ్ర స్కాంలో రోజాపై చర్యలు ఉంటాయని ఊహిస్తున్నారు.

# అపాయింట్మెంట్ ఇవ్వని డీజీపీ.. వైసీపీ తీవ్ర అసంతృప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై వైసీపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ రెండు చోట్ల అధికార పార్టీ అరాచకాలు పేట్రేగిపోతున్నాయని, తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నా పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని వైసీపీ విమర్శిస్తోంది. ఈ విషయంలో జోక్యం చేసుకుని పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయాలని కోరేందుకు డీజీపీని కలవాలని రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నా, తమను కలిసేందుకు డీజీపీ కనీసం ఇష్టపడటం లేదని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఆదివారం సాయంత్రంతో ప్రచార గడువు ముగుస్తున్నందున, వచ్చే రెండు రోజులు సరైన భద్రత కల్పించాలని కోరేందుకు ఈ రోజు కూడా వైసీపీ ప్రయత్నించిందని చెబుతున్నారు. అయితే డీజీపీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ ఆవేదన, ఆందోళనను వెలిబుచ్చారు.



**అసలు పోటీ పోలీసులతోనే..**

పోలీసుల వ్యవహారశైలి కారణంగా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తమకు పోలీసులకు మధ్యే పోటీ జరుగుతుందన్న వాతావరణం నెలకొందని వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. పోలీసుల తీరు ప్రజాస్వామ్యానికే తలవంపులు తెచ్చేలా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికార తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసులు తీరు చూస్తుంటే ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అనే సందేహం కలుగుతోందని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో వైయస్ఆర్సీపీ ఒకవైపు, కూటమి పార్టీలు మరోవైపు పోటీ చేస్తున్నాయని, అయితే అసలైన పోటీ పోలీసులతోనే అని అర్థమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "పోలీసులే ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుంటారు, దాడులకు గురైన మా పార్టీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తారు, బైండోవర్ పేరుతో ప్రతిరోజూ స్టేషన్లో గంటల తరబడి నిర్బంధిస్తారు, దాడులకు పాల్పడుతున్న టీడీపీ శ్రేణులకు పోలీసులే రక్షణ కల్పిస్తుంటారు" అంటూ లేళ్ల అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు.

**వినతిపత్రం ఇచ్చే పరిస్థితి లేదు**

ఈ ఎన్నికల్లో కూటమి పార్టీ గెలిస్తే, అది పోలీసులు గెలిచినట్లుగా భావించాలన్నారు. "దేశంలో ఎక్కడా ఇటువంటి పరిస్థితి గురించి వినలేదు. డీజీపీ ఉన్నది చట్టాన్ని కాపాడటానికి, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి. పోలీస్ విభాగం అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం కార్యకర్తల్లా పనిచేస్తుంటే ఆయన ఎందుకు స్పందించడం లేదు? ప్రతిపక్షంగా జరుగుతున్న పరిణామాలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళేందుకు నాలుగు రోజులుగా ప్రయత్నిస్తుంటే కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. చట్టసభల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్న మాకు కూడా డీజీపీ నుంచి సమయం ఇవ్వకుండా చేస్తున్నది ఎవరు? ఎవరి ఒత్తిడితో డీజీపీ ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రతినిధి బృందం నుంచి కనీసం స్వేచ్ఛగా వినతిపత్రంను కూడా తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు?" అంటూ ప్రశ్నించారు.

**పోలింగ్ కేంద్రాలను మార్చేశారు**

మరోవైపు ఉప ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలను కిలోమీటర్ల దూరంలోని వేరే గ్రామాలకు మార్చేశారు. ఓటర్లు ఏ ధైర్యంతో పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు? పోలీసులతో ఏకపక్షంగా ఓట్లు వేయించుకునే కుట్ర జరుగుతోంది. రాజ్యాంగం ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసుకునే హక్కును టీడీపీ గూండాలు కాలరాస్తుంటే, పోలీసులు వారికి అండగా నిలబడటం దారుణం. ఇప్పటికైనా డీజీపీ కళ్ళు తెరవాలని లేళ్ల అప్పిరెడ్డి కోరారు.

# జగన్ బెంగళూరుకే పరిమితం.. పులివెందుల భారం మొత్తం అవినాశ్ రెడ్డిదే..



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో 12వ తేదీన జడ్పీటీసీ ఉప ఎన్నిక జరగనుంది. ఆదివారం సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. సొంత ఇలాకాలో చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితిలో మాజీ సీఎం జగన్ పులివెందులలో ఇంతవరకు అడుగు పెట్టలేదు. ఈ రోజు కూడా ఆయన పర్యటన లేకపోవడంతో పులివెందుల గెలుపు బాధ్యత మొత్తం కడప ఎంపీ అవినాశ్ రెడ్డిపై పడింది. పులివెందులలో ఎన్నిక జరుగుతున్నా, హోరాహోరీ పోరు నెలకొన్నా స్థానిక ఎమ్మెల్యే అయిన జగన్.. బెంగళూరులోని యలహంక ప్యాలెస్ కే పరిమితమయ్యారు. దీంతో ఆయన తీరుపై విస్తృత చర్చ జరుగుతోంది. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక వ్యక్తిగతంగా జగన్ కి, ఆయన పార్టీ వైసీపీకి చాలా ముఖ్యం. అయినా జగన్ పర్యటించకపోవడంపై రాజకీయంగా చర్చ జరుగుతోంది. వ్యూహాత్మకంగానే జగన్ పులివెందులలో పర్యటించలేదని విశ్లేషిస్తున్నారు. పులివెందుల గెలుపు అనివార్యమైనా తాను ప్రచారం చేస్తే మరింత ప్రాధాన్యం ఏర్పడుతుందని, అప్పుడు ఫలితం తప్పక అనుకూలంగా ఉండాల్సిన అవసరం ఉంటుందని అంటున్నారు. అదే సమయంలో ఫలితం బెడిసికొడితే రాజకీయంగా తీరని నష్టమని అంచనా వేస్తున్నారు. ఈ కారణంగానే వ్యూహాత్మకంగా జగన్ ప్రచారానికి దూరంగా ఉండిపోయినట్లు చెబుతున్నారు. సుమారు వారం రోజుల పాటు ఎన్నిక ప్రచారం జరిగింది. కానీ, జగన్ కానీ, ఆయన సతీమణి కానీ ఎన్నికల ప్రచారంలో కనిపించలేదు. రాజకీయ ప్రత్యర్థి టీడీపీ ఎంతలా కవ్వించినా, జగన్ మాత్రం పెద్దగా పట్టించుకోలేదు. టీడీపీ కవ్వింపులతో ప్రచారానికి వచ్చి ఉప ఎన్నికకు రాష్ట్రవ్యాప్తంగా మరింత ప్రచారం కల్పించడం అనవసరమన్న భావనతోనే జగన్ బెంగళూరులో ఉండిపోయారని అంటున్నారు. ఇదే సమయంలో జిల్లా పార్టీ యంత్రాంగానికి దిశానిర్దేశిస్తున్నారని అంటున్నారు. ప్రచారానికి దూరంగా ఉండిపోవాలని జగన్ నిర్ణయించుకోవడంతో ఆయన రాకుండానే ప్రచార గడువు ముగిసింది. మరోవైపు రెండు రోజుల తర్వాత జరిగే పోలింగ్ రోజున అయినా జగన్ వస్తారా? రారా? అన్న సందేహం నెలకొంది. అయితే ఈ ఎన్నికలో ఓటు వేసే అవకాశం లేకపోవడంతో జగన్ వచ్చే అవకాశాలు కనిపించడం లేదంటున్నారు. పులివెందుల జడ్పీటీసీకి ఉప ఎన్నిక జరుగుతున్నా, మాజీ సీఎం జగన్ ఓటు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఉంది. దీంతో జడ్పీటీసీ ఎన్నికల్లో ఆయనకు ఓటు వేసే అవకాశం లేదు. దీంతో ఎన్నిక ముగిసిన తర్వాతే జగన్ పులివెందుల వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ఎంపీ అవినాశ్ రెడ్డి ఉప ఎన్నిక బాధ్యతను తన భుజస్కందాలపై మోస్తున్నారు. జిల్లాలో ఇతర సీనియర్ నేతలతో ఆయన ఒక్కరే పార్టీ తరఫున ప్రచారం చేశారు. స్థానిక వైసీపీ నేత, ఎమ్మెల్సీ సతీశ్ రెడ్డి కూడా వైసీపీ

# జీతం పడ్డ 5 నిమిషాలకే ఉద్యోగి రాజీనామా.. HR ఏమన్నారంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా కొన్ని విషయాలపై విపరీతంగా చర్చ జరుగుతోంది. కొన్ని కొన్ని సిల్లీ విషయాలైనా అవి జనాలకు ఎంతో ఉపయోగపడేవిగా ఉంటున్నాయి. అంతేకాదు అవి చర్చకు కూడా దారి తీస్తున్నాయి. అయితే తాజాగా ఒక ఉద్యోగి శాలరీ పడిన ఐదు నిమిషాలకే రిజైన్ చేయడం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. దీనిపై నెటిజన్స్ రకరకాలుగా స్పందిస్తున్నారు..అసలు ఏం జరిగింది అనే వివరాలు చూద్దాం..



ఒక కంపెనీలో పని చేస్తున్నటువంటి ఉద్యోగి అకస్మాత్తుగా ఉద్యోగానికి స్వస్తి పలికాడు. ఎలాగంటే ఆయనకు శాలరీ పడిన ఐదు నిమిషాలకే తన హెచ్ఆర్ కు రిజైన్ లెటర్ పంపించాడు. అయితే ఆ ఉద్యోగికి 10 గంటలకు శాలరీ అకౌంట్ లో క్రెడిట్ అయింది.. ఆ తర్వాత ఐదు నిమిషాలకు ఆయన రిజైన్ లెటర్ తన బాస్ కు పంపినట్లు తెలుస్తోంది. దీనిపై స్పందించినటువంటి హెచ్ఆర్ ప్రియవర్షిణి ఈ విషయాన్ని లింక్డ్ ఇన్ వేదికగా పోస్ట్ చేసింది. దీంతో ఇది సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకి దారి తీసింది. మా కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగి 10 గంటలకు జీతం పడితే, 10:05 నిమిషాలకు రిజైన్ చేసినట్టు మెయిల్ పంపించాడని ఆమె తెలియజేసింది. ఇది నైతికమేనా..?అసలు దీన్ని ఎవరైనా సమర్థిస్తారా ? అంటూ పోస్టులో ప్రశ్నించింది.

ఆయనకు ఉద్యోగం చేసే ఉద్దేశం లేకపోతే జాయిన్ అయ్యే ముందే చెప్పొచ్చు కదా.. ట్రైనింగ్ పీరియడ్ అయిపోయిన తర్వాత శాలరీ పడిన వెంటనే ఇలా చేయడం సమంజసం కాదు అంటూ తెలియ జేసింది. ట్రైనింగ్ సమయంలో చాలా సైలెంట్ గా ఉన్నారు. మరి ఆ టైంలోనే తనకున్న ఇబ్బంది గురించి చెబితే బాగుండేది కదా అంటూ కూడా ఆమె చెప్పుకొచ్చింది. అకస్మాత్తుగా రాజీనామా చేయడం ఆయనకు పరిపక్వత లోపించినట్టా.. ? లేదా బాధ్యతాయుతంగా లేనట్టా? అంటూ ప్రశ్నించింది. ఆ ఉద్యోగి ఇలా చేయడం కంపెనీ యాజమాన్యాలతో పాటు తన తోటి ఉద్యోగులకు కూడా తప్పుడు సంకేతాలు ఇస్తుందని ప్రియవర్షిణి పేర్కొంది. ప్రస్తుతం ఈ పోస్టు లింక్డ్ ఇన్ లో పోస్ట్ చేయడంతో వేలాదిమంది లైక్ కొడుతూ కామెంట్లు పెడుతున్నారు.. కొందరు నెటిజన్స్ ఆ ఉద్యోగి నిర్ణయాన్ని సమర్థిస్తుండగా.. మరి కొంత మంది %ఎ=% ని ప్రశ్నిస్తున్నారు. ఇంకొందరు మీరు ఏవేవో కారణాలు చెప్పి ఉద్యోగులను సడన్ గా పీకేస్తారు. అలాంటప్పుడు ఆ ఉద్యోగి బ్రతుకు ఏం కావాలి.. ? అలాంటి సమయంలో మీరు ఈ విధంగా పోస్టులు చేస్తారా? అంటూ కామెంట్స్ పెట్టాడు..

మరో వ్యక్తి దరిద్రాన్ని పోగొట్టుకున్నాడు.. స్వేచ్ఛా జీవిగా జీవించు.. ఉద్యోగంలోకి ఎంటరై జీవితాన్ని మరొకరి చేతిలో పెట్టడం వేస్ట్ అంటూ మాట్లాడారు.. ఇంకొకరు మీరు హెచ్ఆర్ అయి ఉండి ఇలాంటి విషయాలను సోషల్ మీడియాలో పెట్టడం సమంజసం కాదు..మీరు ఎంత పరిపక్వతతో ఉన్నారో ఈ పోస్ట్ తెలియజేస్తుంది అంటూ వార్నింగ్ ఇచ్చాడు. మరొకరు స్పందిస్తూ.. ఆ వ్యక్తి తన భవిష్యత్తు అంధకారం కాబోతుందని ముందుగానే గ్రహించి ఈ నిర్ణయం తీసుకున్నాడేమో అంటూ మాట్లాడాడు.. ఇంకో నెటిజన్ ఆకాశం ఎక్కడ కూడా స్పష్టంగా కనిపించదు మేఘాల గర్జనలన్నీ కూడా వినిపించేనా.. అందుకే అతని నిర్ణయం ఆ విధంగా ఉంది అంటూ చెప్పుకొచ్చాడు..

ఇంకొందరేమో అతనికి ఆ లొకేషన్ నచ్చకపోవచ్చు, అక్కడ చేస్తున్న తోటి ఉద్యోగులతో సరిగ్గా కలవకపోవచ్చు..అందుకే ఆయన రాజీనామా చేసి ఉండవచ్చని కామెంట్లు పెడుతున్నారు. ఇలా ఉద్యోగి శాలరీ పడ్డ ఐదు నిమిషాలకు రాజీనామా చేయడంతో ఆయనపై రకరకాలుగా స్పందిస్తూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# మరో వివాదంలో ఉదయపూర్ ఫైల్స్.. నిర్మాతకు హత్యా బెదిరింపులు!




**హైదరాబాద్ పెన్ పవర్:** 'ఉదయపూర్ ఫైల్స్'.. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి ఏదో ఒక వివాదంలో ఇరుక్కుంటున్న విషయం తెలిసిందే. మొన్నటి వరకు హైకోర్టు, సుప్రీం కోర్ట్ అంటూ తిరిగిన నిర్మాతకి ఇప్పుడు హత్యా బెదిరింపులు రావడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ మేరకు తాజాగా ఆయన తన అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా పోస్ట్ పెట్టారు." ఒక గుర్తు తెలియని వ్యక్తి.. ఉదయపూర్ ఫైల్స్ మూవీ విడుదల ఆపాలి అని, లేని పక్షంలో తనను హత్య చేస్తాను అంటూ " ఒక వ్యక్తి నుంచి బెదిరింపులు వచ్చాయి అని.. నిర్మాత అమిత్ జానీ తెలిపారు. ఈ మేరకు తనకు బెదిరింపు కాల్ వచ్చిన నంబర్ ను కూడా షేర్ చేస్తూ.. ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తర ప్రదేశ్ పోలీస్ శాఖల సోషల్ మీడియా ఖాతాలను ట్యాగ్ చేశారు. అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక ఈ వివాదాస్పద సినిమా విడుదలకు ముందు.. అమిత్ జానీకి కేంద్ర హోంశాఖ వై కేటగిరి భద్రతను కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఉదయపూర్ ఫైల్స్ వివాదం విషయానికి వస్తే.. రాజస్థాన్ రాష్ట్రంలో జరిగిన టైలర్ కన్హయ్య లాల్ హత్యకి సంబంధించింది. 2022 జూన్ 28వ తేదీన ఇద్దరు దుండగులు కన్హయ్య లాల్ దుకాణంలోకి కస్టమర్లుగా నటిస్తూ ప్రవేశించారు. వారిలో ఒకరికి కన్హయ్య లాల్ కొలతలు తీసుకుంటూ ఉండగా.. మరొకరు అతనిని కత్తితో దాడి చేసి తల నరికేశారు. అంతేకాదు ఈ వీడియో మొత్తాన్ని కెమెరాలో బంధించి, ఆన్లైన్లో విడుదల చేశారు. ఇది దేశవ్యాప్తంగా ఎంత సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఈ కథ ఆధారంగా ఉదయపూర్ ఫైల్స్ అనే సినిమా రూపొందించారు. నిజానికి 2025 జూలై 11న ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ ఏకంగా 150 సీన్స్ ను ఈ సినిమా నుండి తొలగించింది. దీనికి తోడు అటు ముస్లిం సంఘాలు కూడా వ్యతిరేకత వ్యక్తం చేశారు.. ముఖ్యంగా ఈ సినిమా విడుదల అయితే.. శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని, ఈ సినిమా ద్వారా ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఉందని , వెంటనే ఈ సినిమా విడుదలను ఆపాలి అని ముస్లిం సంఘాలు డిమాండ్ చేశాయి. దీనికి తోడు సమాజ్ వాదీ పార్టీకి చెందిన మహారాష్ట్ర ఎమ్మెల్యే అబు అజ్మీ కూడా ఉదయపూర్ ఫైల్స్ పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సినిమాను విడుదల చేయకుండా పూర్తిగా నిషేధించాలి అని, శాంతి భద్రతలకు సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాదు అన్ని ప్లాట్ఫామ్ లలో నిషేధించాలని కూడా డిమాండ్ చేయడం జరిగింది. ఇక ఈ సినిమా ట్రైలర్ ని సోషల్ మీడియా నుంచి తొలగించాలని కూడా ఆయన కోరారు. అంతేకాదు మతసామరస్యం దెబ్బతినే అవకాశం ఉందని, ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇకపోతే ఈ సినిమా ఏ మతానికో.. విశ్వాసానికో సంబంధించింది కాదని.. భావజాలం, సత్యం గురించి మాత్రమే అని మూవీ మేకర్స్ చెప్పుకొచ్చారు. అంతేకాదు ఈ చిత్రం నిర్మాత అమిత్ జానీ కూడా కోర్టులో కేసు వేసిన విషయం తెలిసిందే.

# బంగారుబాతు కాదు బంగారు బ్యాక్టీరియా.. దొరికిందో కోటీశ్వరుడే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇప్పటివరకు బంగారు బాతు గురించి అందరికీ తెలుసు. ఈ కథ వినడమే కాదు పుస్తకాలలో చదివాము కూడా.. అయితే ఇప్పుడు బంగారుబాతు కాదు బంగారు బ్యాక్టీరియా అంటూ ఒక వార్త తెరపైకి వచ్చింది. ఇది విన్నాక ఈ బంగారు బ్యాక్టీరియా ఏంటి ? అని ఆశ్చర్యపోతున్నారా? నిజమేనండి.. ఇప్పుడు చెప్పే బ్యాక్టీరియా గురించి వింటే నిజంగా ఇలాంటి బ్యాక్టీరియా మనకెందుకు దొరకదు అంటూ తెగ ఆలోచించడం మొదలు పెడతారు.. అంతేకాదు ఆ బాక్టీరియా ఏంటి? అది ఎలా బంగారం పుట్టిస్తుంది? ఎందుకు దానిని బంగారు బాక్టీరియా అంటున్నారు? అనే విషయాలు కూడా తెలుసుకోకమానరు. మరి బంగారు బాతే కాదు ఈ బంగారు బ్యాక్టీరియా జీవితాలు మార్చడంలో ప్రథమ స్థానంలో నిలవబోతోంది అంటూ శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. మరి ఏంటీ బంగారు బ్యాక్టీరియా హిస్టరీ ఇప్పుడు చూద్దాం..

ఒకవైపు బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుంటే.. మరొకవైపు చెత్తను తిని 24 క్యారెట్ల ప్యూర్ బంగారాన్ని విసర్జించే అరుదైన బ్యాక్టీరియాను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ బ్యాక్టీరియా పేరు 'కుప్రియోవిడస్ మెటాలీడ్యూరన్స్'. బంగారాన్ని విసర్జిస్తున్న నేపథ్యంలో అటు శాస్త్రవేత్తలు ఈ బ్యాక్టీరియాకి ముద్దుగా 'గోల్డ్ పూపింగ్ బ్యాక్టీరియా' అని పేరు పెట్టారు. చెత్తలో లభించే రాగి, ఇతర లోహాలు కలిసిన బంగారం , నికెల్ వంటి వాటిని తిన్నప్పుడు తన జీర్ణ వ్యవస్థలో విడుదలైన ప్రత్యేక ఎంజైముల సహాయంతో వాటిని ఈ బాక్టీరియా 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంలా మార్చి విసర్జిస్తోంది అని వైద్యులు కనుగొన్నారు. ఇక ఈ విషయం తెలిసి అటు ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నా.. మళ్లీ ఆశ్చర్యకర విషయాలు బయటపెట్టారు శాస్త్రవేత్తలు.

విషయంలోకి వెళ్తే.. ఈ బ్యాక్టీరియా కంటికి కనిపించదు. మరి అలాంటి కంటికి కనిపించని ఈ బ్యాక్టీరియా తాలూకు విసర్జితాలు మన కళ్ళకు ఎలా కనిపిస్తాయి? ఇవి కేవలం నానో పార్టికల్స్ పరిమాణంలో ఉంటాయి . ఇక భూతద్దంలో పెట్టి చూస్తే గానీ వీటి జాడ మనం కనుగొనలేము. ముఖ్యంగా ఇది బంగారు గనులు ఉండే చోట, లోహాలతో కలుషితమైన నేలను శుభ్రం చేయడానికి బయోమైనింగ్ పేరుతో ఈ బ్యాక్టీరియాను ఉపయోగించి భూమి కాలుష్యాన్ని తగ్గించాలని అటు శాస్త్రవేత్తలు కూడా భావిస్తున్నారట. మరి కళ్ళకే కనిపించని ఈ బంగారు బ్యాక్టీరియాలను మునుమందు ఎలా అభివృద్ధి చేస్తారో చూడాలి అని అటు ప్రతి ఒక్కరు ఆత్రుతగా ఎదురు చేస్తున్నారు.

ఇక బంగారం ధరల విషయానికి వస్తే.. 2013 అంటే దాదాపు 12 ఏళ్ల క్రితం 10 గ్రాముల బంగారం ధర సుమారుగా 20 నుండి 30 వేల రూపాయలు ఉండేది. కానీ ఇప్పుడు రూపాయి విలువ తగ్గిపోవడం, అటు వివిధ దేశాల మధ్య పోరు.. బంగారు ధరలకు రెక్కలు వస్తున్నాయి. ప్రస్తుతం అదే 10 గ్రాముల బంగారం విలువ లక్షకు పైమాటే..ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ ఇలాంటి సమయంలో బంగారం కొనుగోలు చేయాలి అంటే సామాన్యులకు అత్యంత భారంగా మారిన విషయము అని చెప్పవచ్చు. ఇలాంటి సమయంలో ఇప్పుడు గోల్డ్ మైనింగ్ అని, గోల్డ్ బ్యాక్టీరియా అని వెలువడుతున్న వార్తలు అటు ప్రజలలో ఆశలు పెంచుతున్నాయి కానీ ఇవి బంగారం ధరలను ఏమాత్రం తగ్గించగలవు అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

# లైఫ్ టైం క్రికెట్ డ్రీమ్ ఏంటో చెప్పిన శాంసన్.. ఏకంగా యువీ రికార్డుపైనే కన్ను



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ప్రస్తుతం ఆసియా కప్ కోసం సిద్ధమవుతున్నాడు. టీ20 క్రికెట్ లో సూపర్ ఫామ్ లో ఉన్న శాంసన్ ఆసియా కప్ కు ఎంపికవ్వడమే కాదు తుది జట్టులో ఆడడం ఖాయంగా కనిపిస్తుంది. ఆసియా కప్ కోసం టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ లిస్ట్ లో శాంసన్ మొదటి వరుసలో ఉన్నాడు. రిషబ్ పంత్ గాయం కారణంగా ఆసియా కప్ కు దూరం కావడంతో సంజు ఇండియాకు వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. అభిషేక్ శర్మతో పాటు ఓపెనర్ గా ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగనున్నాడు. ఈ కాంటినెంటల్ టోర్నీకి ముందు అశ్విన్‌తో జరిగిన యూ ట్యూబ్ చానెల్‌లో శాంసన్ క్రికెట్ లో తన డ్రీమ్ ను పంచుకున్నాడు. ఇంటార్వ్యూలో భాగంగా అశ్విన్ నీ డ్రీమ్ అని అడిగాడు. అందుకు శాంసన్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు కొట్టడమే తన లక్ష్యమని చెప్పుకొచ్చాడు. ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్ లో టీమిండియా తరపున యువరాజ్ సింగ్ మాత్రమే ఆరు బాల్స్ కు ఆరు సిక్సర్లు కొట్టాడు. 2007 టీ20 వరల్డ్ కప్ లో యువరాజ్ సింగ్ ఇంగ్లాండ్ పై ఒకే ఓవర్లో ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టడం విశేషం. దేశవాళీ క్రికెట్ లో రవిశాస్త్రి, ఋతురాజ్ గైక్వాడ్ ఈ ఫీట్ సాధించారు. ఉప్పల్ వేదికగా గత ఏడాది బంగ్లాదేశ్ తో జరిగిన మూడో టీ20 మ్యాచ్ లో సంజు శాంసన్ ఇన్నింగ్స్ 10 ఓవర్లో రిషద్ బౌలింగ్ లో సంజు వరుసగా 5 సిక్సర్లు బాది 40 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సంజు శాంసన్ అంతర్జాతీయ టీ20 క్రికెట్ లో దూసుకెళ్తున్నా ఐపీఎల్ కెరీర్ ను సందిగ్ధంలో పడేసుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ జట్టులో ఉండడానికి ఆసక్తి చూపించనట్టు సమాచారం. రాజస్థాన్ ఫ్రాంచైజీని విడుదల చేయాలని అధికారికంగా రిక్వెస్ట్ చేసినట్టు క్రిక్‌బజ్ కన్ఫర్మ్ చేసింది. గురువారం (ఆగస్టు 7) క్రిక్‌బజ్‌లో నివేదిక ప్రకారం, సామ్సన్, రాజస్థాన్ రాయల్స్ కు మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నాయని.. తనని వేలంలోకి పంపాల్సిందిగా సంజు కోరినట్టు తెలుస్తోంది. సామ్సన్ ఇకపై రాయల్స్‌తో కొనసాగాలని కోరుకోవడం లేదని అతని కుటుంబ సభ్యులు బహిరంగంగా చెబుతున్నారు. దీంతో సంజు ట్రేడింగ్ ద్వారా చెన్నై జట్టులోకి లేదా వేలంలోకి రానున్నాడు.

# బీసీసీఐ స్ట్రిక్ట్ రూల్.. ఆ కండీషన్‌కు ఓకే అంటేనే వరల్డ్ కప్‌కు రోహిత్, కోహ్లీ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే భవిష్యత్ డైలమాలో పడింది. వీరిద్దరూ టార్గెట్ చేసిన 2027 వన్డే ప్రపంచ కప్ ఆడే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. సీనియర్ ప్లేయర్లు అయినప్పటికీ వీరు వన్డే వరల్డ్ కప్ వరకు జట్టులో కొనసాగడం కష్టమని బీసీసీఐ చెప్పనట్టు సమాచారం. తాజా నివేదికల ప్రకారం ఈ సీనియర్ ప్లేయర్స్ వరల్డ్ కప్ ప్రణాళికలో లేరు. అక్టోబర్ లో ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే సిరీస్ వారి కెరీర్ లో చివరిదైనా ఆశ్చర్యం లేదని ఎక్స్ పర్ట్స్ భావిస్తున్నారు. భారత జట్టు కొత్త శకానికి సిద్ధమవుతోందని, వన్డేల్లో యువ ఆటగాళ్లకు మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉందని రిపోర్ట్స్ చెబుతున్నాయి. వరల్డ్ కప్ కు మరో రెండున్నరేళ్ల సమయం ఉంది. ప్రస్తుతం రోహిత్, కోహ్లీ వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడడంతో వారి ఫామ్ ఆందోళన కలిగిస్తుంది. వీరిద్దరూ ఆ సమయానికి ఫిట్ నెస్ తో పాటు ఫామ్ లో ఉంటారంటే ఖచ్చితంగా చెప్పాలని పరిస్థితి. టెస్ట్ క్రికెట్ లో పేలవ ఫామ్ కారణంగానే ఈ ఇద్దరూ సుదీర్ఘ ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఒక్క ఫార్మాట్ ఆడడంతో వీరి ఫామ్ ప్రస్నార్ధకంగా మారింది. బీసీసీఐ కూడా రోహిత్, కోహ్లీ జోడీ ఖచ్చితంగా జట్టులో ఉంటారనే గ్యారంటీ ఇవ్వలేకపోతుంది. ఈ ఇద్దరు దిగ్గజ క్రికెటర్లు లేకపోయినా ఇటీవలే ఇంగ్లాండ్ తో జరిగిన టెస్ట్ సిరీస్ ను టీమిండియా అద్భుతంగా ఆడి 2-2 తో సమం చేసుకుంది. రోహిత్, విరాట్ జట్టులో తమ స్థానాలను నిలుపుకోవాలనుకుంటే ఒకటే దారి కనిపిస్తోంది. వీరిద్దరూ దేశవాళీ క్రికెట్ లో వన్డే ఫార్మాట్ లో జరగబోయే విజయ్ హజారే ట్రోఫీలో ఖచ్చితంగా ఆడి వారి ఫామ్ ఫిట్ నెస్ ను నిరూపించుకోవాల్సి ఉంది. ఇలా జరిగితేనే వీరు రానున్న రెండేళ్లపాటు జట్టులో కొనసాగనున్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ సమయానికి రోహిత్ వయసు 40 సంవత్సరాలు. మరోవైపు కోహ్లీకి 38 ఏళ్ళు నిండుతాయి. ప్రస్తుతం ఒకటే ఫార్మాట్ ఆడుతున్న వీరిద్దరూ ఫిట్ నెస్, ఫామ్ ఎలా ఉందో తెలియకుండా డైరెక్ట్ గా 2027 వన్డే వరల్డ్ కప్ ఆడడానికి బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇవ్వట్లేదు. దేశవాళీ క్రికెట్ లో నిరూపించుకుంటేనే వారు వన్డేలో కొనసాగనున్నారు.

# సెంచరీ చేయలేకపోవడంతో నిరాశకు గురయ్యా: ఇంగ్లాండ్ టూర్ వైఫల్యంపై నోరువిప్పిన కరుణ్ నాయర్



**హైదరాబాద్ పెన్ పవర్:** 8 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చిన సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ ఇంగ్లాండ్ పర్యటనలో పూర్తి విఫలమయ్యాడు. ఐదు మ్యాచుల టెస్టు సిరీస్?లో అంచనాల మేర రాణించలేదు. సిరీస్? మొత్తంలో కేవలం ఒక్క హాఫ్ సెంచరీ మాత్రమే చేసి పూర్తిగా నిరాశపర్చాడు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ టూర్ వైఫల్యంపై నోరు విప్పాడు కరుణ్ నాయర్. ఇంగాండ్ టూర్?లో తన ప్రదర్శనపై అసంతృప్తిగా ఉందన్నాడు. ది ఓవల్ స్టేడియం వేదికగా జరిగిన చివరిదైనా ఐదో టెస్ట్?లో హాఫ్ సెంచరీని సెంచరీగా మల్చలేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని మనసులో మాట బయటపెట్టాడు. కానీ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు హాఫ్ సెంచరీతో ఆదుకోవడం కాస్తా ఆనందాన్ని ఇచ్చిందన్నాడు. ఇంగ్లాండ్ సిరీస్?కు ముందు కౌంటీల్లో, ఇంగ్లాండ్ ఏ జట్టుతో జరిగిన మ్యాచుల్లోనే బాగానే ఆడానని.. కానీ ముఖ్యమైన సిరీస్ లో అంతగా రాణించలేకపోయాయని నిజం ఒప్పుకున్నాడు. తన పునరాగమనాన్ని ఘనంగా చాటలనుకున్నాను కానీ.. అలా చేయలేకపోయానని అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇంగ్లాండ్ పర్యటన వైఫల్యం గురించి ఆలోచించడటం పక్కనే పెట్టి.. రాబోయే మ్యాచులపై దృష్టి పెడతానన్నాడు. తప్పులను సరిదిద్దుకుని భారీ స్కోర్లు సాధించడంపై ఫోకస్ చేస్తానన్నాడు. నాయర్ ప్రస్తుతం మహారాజా ట్రోఫీ %ు%20 టోర్నీపై దృష్టి సారించాడు. దేశవాళీ లీగుల్లో టన్నుల కొద్ది పరుగులు వరద పారించిన కరుణ్ నాయర్.. సుదీర్ఘ విరామంతో తర్వాత వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో విఫలమయ్యాడు. దీంతో ఇండియా జట్టులో దాదాపు కరుణ్ నాయర్ కెరీర్ ఖతమైనట్లు. తిరిగి జట్టులోకి రావాలన్న అతడి కలలు కలలుగానే మిగిలిపోయే అవకాశం ఉంది.

# 'సయ్యార' కోసం అయినా వార్ ఆపొచ్చుగా...!

హృతిక్ రోషన్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో రూపొందిన 'వార్ 2' సినిమా మరో నాలుగు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల కాబోతున్న వార్ 2 సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమాలో టాలీవుడ్ స్టార్ ఎన్టీఆర్ కీలక పాత్రలో నటించిన నేపథ్యంలో సౌత్ ఇండియాలోనూ వార్ 2 కి భారీ హైప్ క్రియేట్ అయింది. వార్ 2 సినిమా ఖచ్చితంగా భారీ ఓపెనింగ్స్‌ను నమోదు చేయడం ఖాయం. పోటీగా కూలీ సినిమా ఉన్నప్పటికీ వార్ 2 కి ఉన్న స్టార్ కాస్ట్, బజ్ నేపథ్యంలో వందల కోట్ల ఓపెనింగ్స్‌ను మేకర్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. అందుకు తగ్గట్లుగానే భారీ రిలీజ్‌ను ప్లాన్ చేశారని సమాచారం అందుతోంది.








**కూలీ వర్సెస్ వార్ 2**

వార్ 2 సినిమాకు సంబంధించిన షూటింగ్ కార్యక్రమాలు కొన్ని కారణాల వల్ల లేట్ అయ్యాయి. అయినా కూడా ఆగస్టులోనే సినిమాను విడుదల చేయాలి అనే పట్టుదలతో దర్శకుడు అయాన్ ముఖర్జీ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను స్పీడ్‌గా చేయించినట్లు సమాచారం. కూలీ సినిమా కోసం వార్ 2 సినిమా వాయిదా వేయాలని చాలా మంది కోరారు. సోషల్ మీడియా ద్వారానే కాకుండా ఇండస్ట్రీకి చెందిన వారు కూడా చాలా మంది వార్ 2 ను వాయిదా వేయవచ్చుగా అంటూ విజ్ఞప్తి చేశారు. కానీ యశ్ రాజ్ ఫిల్మ్స్ వారు వార్ ను వాయిదా వేసే ప్రసక్తే లేదని అన్నారు. కానీ ఇప్పుడు వారే వార్ 2 ను ఆగస్టు 14న విడుదల చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి నడుస్తున్న తమ సినిమాకు వార్ 2 వల్ల డ్యామేజీ అంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సయ్యార బాక్సాఫీస్ రిపోర్ట్**

యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ నుంచి వచ్చిన రొమాంటిక్ ఎంటర్ టైనర్ 'సయ్యార' బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు నమోదు చేస్తున్న విషయం తెల్సిందే. సయ్యార విడుదలైన నాలుగు వారాల తర్వాత వార్ 2 ను విడుదల చేయాలని యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ వారు ముందస్తు ప్లాన్ చేసుకున్నారు. సయ్యార సినిమా విషయంలో పెద్దగా నమ్మకం లేకుండానే మేకర్స్ విడుదల చేశారు. కానీ ఇప్పుడు సయ్యార సినిమా థియేటర్ లో భారీ వసూళ్లు రాబడుతూ దూసుకు పోతుంది. ఇప్పటి వరకు దాదాపుగా రూ.500 కోట్ల వసూళ్లను ఈ సినిమా రాబట్టినట్లు తెలుస్తోంది. మరో మూడు నాలుగు వారాల పాటు సయ్యార బాక్సాఫీస్ రన్ కి ఛాన్స్ ఉందని బాక్సాఫీస్ వర్గాల వారు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో వార్ 2 రాబోతున్న నేపథ్యంలో సయ్యార సినిమాను తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది.

**సయ్యార తొలగించాల్సిందే**

వార్ 2 సినిమా విడుదల తేదీ విషయంలో చాలా కాలం క్రితమే నిర్ణయం తీసుకున్నారు. అయితే సయ్యార సినిమా ఎంత చేసినా కేవలం రెండు మూడు వారాల కంటే ఎక్కువగా థియేటర్‌లో ఉండటం సాధ్యం కాదని యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ వారు అనుకుని ఉంటారు. అందుకే సయ్యార విడుదలైన సరిగ్గా నాలుగు వారాల తర్వాత వార్ 2 విడుదల ఉండే విధంగా ప్లాన్ చేశారు. కానీ ఇప్పుడేమో సయ్యార కి నాలుగు వారాల సమయం సరిపోవడం లేదు. ఇతర భాషల్లో సినిమాను చూస్తూనే ఉన్నారు. అంతే కాకుండా హిందీ వర్షన్ సైతం మరో రెండు మూడు వారాలు అయినా ఆడే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో వార్ 2 రావడం వల్ల మంచి వసూళ్లు వస్తున్న థియేటర్ నుంచి సయ్యార సినిమాను తొలగించాల్సి ఉంటుంది. అందుకే సయ్యార సినిమా కోసం అయినా వార్ 2 సినిమా విడుదల వాయిదా వేయచ్చు కదా అని కొందరు విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. కనుక వార్ 2 సినిమా వాయిదా పడే అవకాశం లేనే లేదు.

ఎడిన్ రోజ్ సన్‌షైన్‌లో ఎల్లో ఎ స్టైల్ స్టేట్‌మెంట్‌లో ప్రకాశవంతంగా మెరిసింది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com